

మరనాత మెసేంజర్
క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక
MARANATHA MESSENGER
విడి ప్రతి
రూ.10/-
సంపుటి 37
అక్టోబరు 2019
సంచిక 10

## ఈ సంచికలో...

ప్రధాన సంపాదకులు : శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

సంపాదక వర్గం :

రెవ. ఫిలిప్ ప్రకాష్, రెవ. డా. నిరీక్షణ కుంచర్ల, రెవ. జి.యం.రాజా, రెవ.జి.యేసుబాబు

మీ చందాలు, వ్యాసములు ఈ క్రింది చిరునామాకు పంపించండి

**మరనాత మెసెంజర్**

గాయత్రి నగర్, విజయవాడ - 520 008.

Phone : 0866 - 2480047, e-mail : mvs828@gmail.com

Bank Details : THE SOUTH INDIAN BANK LTD

A/c No.0142073000000861 IFSC : SIBL0000414

**ప్రకటన వివరాలు**

పూర్తి పేజి : రూ. 1,500/- అరపేజి : రూ. 800/-

టైటిల్ పేజి 3 లేక 4 : పూర్తి పేజి రూ. 3,000/- అరపేజి రూ.1,500/-

| | స్వదేశములో | విదేశములో |
|---|---|---|
| సాలుసరి చందా | రూ. 150/- | రూ. 1,000/- |
| విశేష సభ్యత్వం | రూ. 1,000/- | రూ. 3,000/- |
| జీవిత సభ్యత్వం | రూ. 5,000/- | రూ. 15,000/- |

This Magazine is Printed, Published and Owned by G. Moses Choudary & Printed at Alpha & Omega Publications & Printing Works, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008. This Magazine is Edited by G. Moses Choudary, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008.

# లూకా సువార్త
## (40 వ భాగము)

శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ

## క్రీస్తును వెంబడించాలంటే..? : (లూకా సువార్త 9 : 23-27)

పాఠకులైన మీరు, మీకుటుంబమంతా కుశలమేగదా? దేవుని మంచితనమును, దయాళుత్వమును, దీర్ఘశాంతమును, నమ్మకత్వమును అద్భుతముగా అనుభవించడం మనకు సాధ్యమే. ప్రతివిషయములో మీరేం కలిగిఉన్నారో దానినిబట్టి కృతజ్ఞత కలిగి దేవుని స్తుతించండి.

డా॥ లూకా వ్రాసిన యేసు సుబోధనాలను, కార్యాలనుగూర్చి నేర్చుకుంటున్నాం. ఈ సంచికలో లూకా సువార్త 9 : 23-27 భాగాన్ని ఆధారంచేసుకొని ధ్యానంచేద్దాం. ఒకనాడు యేసు తన శిష్యులను - "ప్రజలు నన్నుగూర్చి ఏమనుకొంటున్నారని ప్రశ్నించగా వారు - బాప్తిస్మమిచ్చు యోహాననియు, కొందరు - ఏలియావనియు, కొందరు - పూర్వకాలపు ప్రవక్త యొకడు లేచెననియు చెప్పుకొనుచున్నారు అని జవాబిచ్చారు. అందుకాయన - మీరైతే నేనెవడనని చెప్పుకొనుచున్నారని శిష్యులను అడుగగా, అందుకు పేతురు - నీవు దేవుని క్రీస్తువనెను". ఆయన దేవుడైయుండియు మానవాళి నిమిత్తమై ఉద్భవించిన మెస్సీయగా గుర్తించారు, ఒప్పుకొన్నారుకాని యూదాజాతికి రాజకీయ విమోచనను కలిగిస్తాడని భావిస్తూఉన్నారు. యేసు - **"మనుష్య కుమారుడు (తనకు రిఫర్ చేసుకొంటూ) బహు శ్రమలు పొంది, పెద్దలచేతను, ప్రధానయాజకుల చేతను, శాస్త్రులచేతను విసర్జింపబడి, చంపబడి, మూడవ దినమున లేచుట అగత్యమని చెప్పెను" (లూకా 9 : 22).** అప్పుడు యేసు అందరిని ఉద్దేశించి - **"ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్ను తాను ఉపేక్షించుకొని ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను".** ప్రభువైన యేసును వెంబడించ గోరువాని లక్షణాలు ఎలా ఉండాలనేది ఈ సందేశములో తెలుసుకొందాం.

### 1. ఎవరైన నన్ను వెంబడింపగోరినయెడల తననుతాను ఉపేక్షించుకోవాలి :-

**ఉపేక్షించుకోవడమంటే : ఉదాహరణకు :** సీమోను పేతురు యేసుకు ప్రియమైన శిష్యుడు. ప్రభువంటే ప్రాణం పెట్టేటంత త్యాగంతో కూడిన సమర్పణ కలిగినవాడు. కాని, యేసు సిలువ మరణానికి ముందుగా పేతురు - ప్రభువా, నీతోకూడ చెరలోనికి, మరణమునకు వెళ్లుటకు సిద్ధముగాఉన్నానని అనగా, యేసు - పేతురూ, నీవు నన్నెరుగనని ముమ్మారు చెప్పువరకు, నేడు కోడికూయదని నీతో చెప్పుచున్నాననెను. ఆ తరువాత ఒక

చిన్నది పేతురును తేరిచూచి - నువ్వు యేసుతోకూడ ఉన్నవాడవు కదా? అనగా, నేనా, ఏంటమ్మాయ్ అట్లా మాట్లాడుతున్నావు, నేను అతన్ని ఎరుగనని బొంకాడు. అలా ప్రభువు అన్నట్లుగానే కోడికూయక మునుపు పేతురు మూడుసార్లు ప్రభువును ఎరుగనని బొంకాడు. అంటే, యేసును తృణీకరించాడు, ఉపేక్షించాడన్నమాట! అలాగే, మిమ్మును మీరు, నన్ను నేను ఉపేక్షించుకోవాలి. యేసును వెంబడించాలంటే మన ప్రాణాన్ని సైతం తృణీకరించే ధోరణి, సమర్పణ, అంకితభావం మనలోకి రావాలి. నిన్ను నీవు ఉపేక్షించుకొంటేనే యేసును వెంబడించడానికి నువ్వు సరిపోతావు. ప్రాణప్రదంగా ఎంచుకొనే నాప్రాణాన్ని తృణీకరించ మంటారేమిటి? ఇది చాలా కష్టంకదా అనిపిస్తే - అది ప్రభువైన యేసు సెలవిస్తున్న మాట. కాబట్టి తు.చ. తప్పక పాటించవలసిందే !

వేదజ్ఞానులు చెప్పేదేమిటంటే- యేసు చిన్ననాడు, సుమారుగా 11 సంవత్సరముల వయస్సులో ఆయన ఇశ్రాయేలు దేశములో ఉత్తరాదిన ఉన్న గలిలయ లోని నజరేతు అను పట్టణములో పెరుగుతూ ఉన్నప్పుడు భయంకరమైన సిలువ శిక్షలు అమలుజరిగాయి. అప్పట్లో యూదా అనేవాడు తిరుగుబాటుచేసి తన అనుచరగణంతో నజరేతుకు సుమారు 4 మైళ్ల దూరములోఉన్న సెఫోరిస్ అనే ఊరిలో ఉన్న రోమీయుల ఆయుధాగారం మీద దాడిచేసాడు. ఆయుధాలన్నీ దొంగిలించి ఉగ్రవాద ఉద్యమముతో వాళ్లని బయటికి గెంటేసి దేశానికి రాజకీయ స్వతంత్ర్యం కలిగించాలని ప్రయత్నం చేసాడు. ఆ తిరుగుబాటుచేసిన యూదాను, అతడి అనుచరులను 2 వేల మందిని సిలువలో వ్రేలాడదీసి రోడ్డుప్రక్కన దారుణంగా చిత్రహింసలు పెట్టారు. ఆ ఊరి వాస్తవ్యులైన యూదులనందరిని బానిసలుగా అమ్మేసారు. నజరేతుకు నాలుగు మైళ్ల దూరంలో రెండువేల మందికి రోడ్డుప్రక్కన ఇంత దారుణమైన సిలువ మరణ శిక్షలువేస్తే ఆఊర్లో అప్పటికి పదకొండేళ్ల ప్రాయము కలిగిన యేసు చూడడానికి వెళ్లకుండా ఉన్నాడా? ఖచ్చితంగా చూసాడు. చిన్ననాడే సిలువ మరణమును గురించి ఎరిగినవాడు యేసు. విచిత్రమేమిటంటే, మానవ పాపహరణము, విమోచన కొరకు తాను ఇలాంటి దారుణమైన మరణాన్ని సిలువలో పొంది, త్యాగం చేయవలసి ఉన్నానని అప్పటికే యేసుకు తెలుసు. ఆయన శిష్యులతో చెబుతున్నాడు -

## 2. “ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను”:-

తన స్వీయప్రయోజనాన్ని కాకుండా దేవునికొరకు అవసరమైతే తన ప్రాణాన్ని సైతం బలియాగం చేసేలాగ ఉండాలి, తన సిలువనెత్తుకోవాలి. అంటే యేసును వెంబడించడానికి నీ ఆస్తిపాస్తులు, భూములు, ఇళ్లు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్లు, కుటుంబీకులు ఎవరైనా అడ్డుగా వస్తే వాళ్లని తృణప్రాయంగానే ఎంచుకోవాలి, వాళ్లని కాదనుకోవాలి. అప్పుడే నన్ను అనుసరించడానికి సరిపోతారు. అని ప్రభువు సెలవిచ్చాడు. ఈ బోధ చాలా కఠినంగా ఉందికదూ !

"తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును. నా నిమిత్తమై తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును''. పోగొట్టుకొనే వాళ్లు దక్కించుకొంటారు? దక్కించుకోవాలనుకొనేవాళ్లు పోగొట్టుకొంటారు? ఆ పోగొట్టుకోవటము కూడ యేసును అనుసరిస్తూ ప్రభువైన యేసుకొరకు త్యాగం చేయాలనుకొన్నవాడు తన ప్రాణము దక్కించుకుంటాడంట! పరస్పరవైరుధ్యం కలిగిన సూత్రాలివి. ఒక్కమాటలో చెబితే - యేసు కొరకు చావాలనుకొన్నవాడు బ్రతుకుతాడు. ఇందులో అద్భుతమైన అర్థంఉంది. సత్యం, మార్గం, జీవమైయున్న క్రీస్తు ప్రభువు శిష్యరికములోచేరి, ఆయనను నమ్ముకొని తన ప్రాణాన్ని తృణప్రాయంగా ఎంచి, జీవితాన్ని త్యాగసహితంగా సమర్పణచేసుకొంటే, యేసు అడుగు జాడలలో నడవడం సాధ్యమవుతుందని ఖరాఖండిగా తేల్చి చెప్పాడు యేసయ్య. యేసుప్రభువును నమ్ముకొంటే జబ్బులు పోతాయని ఉద్యోగాలు, ప్రమోషన్లు వస్తాయని, వ్యాపారంలో లాభాలు, కుటుంబ సమస్యలనుండి విడుదల కలుగుతుందని నమ్ముకున్నాను. ఇప్పుడేమో ప్రాణాన్ని తృణప్రాయంగా ఎంచమంటున్నారు, అయినవాళ్లని కానివాళ్లని వదులుకోవాలి, త్యాగం చెయ్యాలి అంటున్నారు ఇదేమిటండీ అంటే, ఇది ప్రభువైన యేసు చెప్పినమాట.

ప్రభువైన యేసును నమ్ముకొంటే కుటుంబసమస్యలు పరిష్కారము, ఉద్యోగాలు, ప్రమోషన్లు, వ్యాధులునుండి స్వస్థత కలిగే మాట నిజమే. ప్రమాదాలనుండి తప్పించబడుట, ఆయన ఆశ్రయం కోరినవారికి ఆదరణ, అర్థవంతమైన దీవెనలు పొందేమాట నిజమే, అది కోటానుకోట్లమంది పొందుతున్న దివ్యానుభూతియే! కాని ప్రభువైన యేసును వెంబడించడము భౌతికమైన, ఆర్థికమైన ఆశీర్వాదాలకు పరిమితమై యుండడానికి వీల్లేదు. యేసును వెంబడించాలంటే వెల ఉంది. ఆదే మన ప్రాణాన్ని కూడ తృణప్రాయంగా ఎంచుకొనుట.

తల్లిదండ్రులనైన, అన్నదమ్ములనైన, అక్కచెల్లెళ్లనైన, భూములనైన, ఇళ్లనైన అవి యేసును వెంబడించడానికి అడ్డువస్తే వాటిని తృణప్రాయంగా ఎంచుకొని విడిచి పెట్టాల్సిందే. యేసుప్రభువును నమ్ముకొంటే నాకేమి వస్తుంది అనుకోవడం త్యాగం కాదు. నేను ప్రభువైన యేసును నమ్మి అనుసరిస్తున్నందున దేవునికి ఎంత మహిమ కలుగుతుంది, నావల్ల పరులకు ఎంత ప్రయోజనం చేకూరుతుందనేది ప్రశ్నించుకోవాలి. స్వీయ ప్రయోజనం అసలు కోరుకోకూడదంటారా? అని అడిగితే, కోరుకోకూడదని కాదు. మన స్వీయ ప్రయోజనం కంటె పరుల ప్రయోజనాన్ని, ప్రభువుకు మహిమకలుగుటను మరింత ప్రాముఖ్యంగా ఎంచుకోవాలి. అప్పుడే యేసును వెంబడించడానికి మనం సరిపోతాం. సిసలైన క్రైస్తవవిశ్వాసి ప్రభువుకొరకు, ప్రజలకొరకే జీవింప బద్ధుడు. దైవసేవకులారా, బ్రతుకుతెరువు కొరకు దేవుడు మనలను ఈ సేవలోకి పిలువలేదు. ప్రభువు నామ మహిమార్థమై ఆయన సువార్త ప్రకటన, తద్వారా ప్రజలు దీవించబడడము కొరకై మనలను పిలిచాడు. ప్రజలెన్ని బాధలలో,

ఎంత ఆవేదనతో ఉన్నారో మనం చూస్తున్నాం. పేదల్లోను, ధనికుల్లోకూడ బాధితులున్నారు. సిసలైన సేవకుడు బ్రతుకు తెరువు చూచుకోవడం కంటె ప్రజల యొక్క బాగోగులను పట్టించుకొని, వాళ్లకు దైవికమైన సూత్రాలు, సందేశాలు చెప్పి వారిలో గొప్ప ధైర్యం, ప్రోత్సాహం నింపాలి. వ్యసనపరులను విడిపించే అద్భుతమైన సువార్త సందేశం చెప్పాలి. పరులను బ్రతికించడమే సేవయొక్క ముఖ్య ఉద్దేశ్యమైయుండాలి. ఒక్కమాటలో చెబితే మీకొరకు మీరు, నాకొరకు నేను జీవించడంకంటె దేవునికొరకు, ప్రజలకొరకే మనం జీవింప బద్ధులం. అదే ధోరణితో ఉండవలె.

**త్యాగసహితమైన జీవితానికి ఒక ఉదాహరణ :-** అతనొక క్రైస్తవ సాధువు, అతని పేరు టెలిమాకస్. మధ్యవయస్కుడు, గుహల్లో కూర్చొని ప్రార్థనలో గడిపేవాడు. ఒకరోజు మోకాళ్లమీద ఉండి ప్రార్థన చేసుకొంటూ ఉండగా రోమా పట్టణమునకు వెళ్లమని ఒక స్వరం వినపడింది. విన్న దేవుని స్వరానికి విధేయుడై వెళ్లాడు. అతడికి రోమా నగరములో ఎక్కడికి వెళ్లాలో తెలియదు. నగరంలో ప్రవేశించేసరికి జనం గుంపులు గుంపులుగా నడిచివెళుతున్నారు. ఆ జనంతో కలిసి వారితోపాటు వెళుతున్నాడు. వారందరూ ఒక్క పెద్ద స్టేడియంలోకి వెళ్లారు. క్రీస్తుశకం మొదటి శతాబ్దములో ఆనాటి రోమన్ సీజర్ ప్రభువైన టైటస్ చక్రవర్తి ఆధ్వర్యములో ఆ స్టేడియం కట్టబడినది. ఇప్పటికీ రోమా నగరములో శిధిలావస్థలోఉన్న 'కొలోసియం' అది. రోమ్ వెళ్లినప్పుడు నేనుకూడ దాన్ని చూచాను. అది 'గ్లాడియేటర్స్' అనే రక్తసిక్తమైన ఆటలపోటీ కొరకు కట్టబడినది. ఆ రక్తక్రీడలు చూడడానికి సీజరు ప్రభువు కుటుంబమంతా వెళ్లి అక్కడ కూర్చొనేవారు. 50 వేల మందికి పైగా కూర్చోవటానికి రాతి బెంచిలు కట్టబడిఉన్నాయి. గ్లాడియేటర్స్ కత్తులతో పోరాటం చేస్తుంటే రక్తసిక్తమైన ఆ క్రీడను వేలాది ప్రజానీకం చప్పట్లుకొడుతూ, ఈలలువేస్తూ తిలకిస్తూ ఉండేవారు. ఇలాంటి రక్తక్రీడను తిలకిస్తూ చప్పట్లు, ఈలలుతో స్పందిస్తున్నారంటే ఆ ప్రజలు ఎంత రక్త పిపాసులనుకోవాలి!!

టెలిమాకస్ అనే ఈ క్రైస్తవ సాధువుకూడ వెళ్లాడు. అక్కడ ఏ జరుగుతుందో ఏమి తెలియదు. గ్లాడియేటర్స్ అనే ఈ రక్తక్రీడను గురించి అతనికి అవగాహన లేదు. కాసేపటికి అంతా తెలిసింది. క్రీడల్లో పాల్గొనేవారు సీజర్ చక్రవర్తి ముందుకెళ్లి సెల్యూట్ చేసారు. రక్త క్రీడ మొదలైంది. ఇంత అమానవీయమైన క్రీడను చూచి టెలిమాకస్ గుండె పగిలినంత పనయ్యింది. ఆపండి.. ఆపండి అంటూ పెద్దగా అరవడం మొదలుపెట్టాడు. ఈలలు, చప్పట్లు మధ్యలో ఇతని కేకలు ఎవరూ పట్టించుకోలేదు. చివరకు ఊరుకోకుండా తన సీటులోనుంచి గబుక్కున గ్రౌండ్‌లోకి దూకేసాడు. అందరూ నిశ్చేష్టులైపోయారు. ఈలలు, చప్పట్లు ఆగిపోయాయి. గ్లాడియేటర్స్ కూడ ఆగిపోయారు. చివరకు అందులో ఒక గ్లాడియేటర్ తన ఖడ్గాన్ని తీసుకొని చంపడానికి ప్రయత్నం చేస్తుంటే, టెలిమాకస్ పరుగిడుతున్నాడు. కొద్దిసేపటికి పరుగెత్తుతూఉన్న టెలిమాకస్ క్రింద పడిపోయాడు. ఆ గ్లాడియేటర్ తన

ఖడ్గంతో అతనిని కొట్టాడు. ఆ దెబ్బకు రక్తసిక్తమై చలనములకుండా పడిపోయాడు. సీజరు చక్రవర్తితోసహా ప్రజలందరూ నిశ్చేష్టులై మౌనంగా ఉండిపోయారు. ఒక సాధువు సాధువస్త్రాలతో వచ్చినందున నిర్దాక్షిణ్యంగా కత్తులతో చంపేసాడు గ్లాడియేటరు. అంతా నిశ్శబ్దం ఆవరించింది. కొద్దినిమిషాలకు ఒక మనిషి ఆస్టేడియంలో తన సీటులోనుంచి లేచి మౌనంగా బయటికి వెళ్లిపోయాడు. తరువాత ఇంకొకరు, మరొకరు మొత్తం వేవేలమంది నెమ్మదిగా వెళ్లిపోయారు. సీజరు చక్రవర్తికూడ కుటుంబంతో మౌనంగా వెళ్లిపోయాడు. గ్లాడియేటర్సు వాళ్ల ఖడ్గాలు అక్కడ పారేసి వాళ్లు వెళ్లిపోయారు. ఆరోజే సీజరు చక్రవర్తి ఇకమీదట ఆ గ్రౌండ్‌లో గ్లాడియేటర్స్ అనే ఈ రక్తక్రీడ జరగడానికి వీల్లేదని ఒక శాసనాన్ని జారీచేసాడు.

ఒక జీవితం బలైపోయింది, త్యాగమైపోయింది కాని వేవేల జీవితాలను, కుటుంబాలను అతలాకుతలం చేసిన 'గ్లాడియేటర్స్' అనే రక్తక్రీడకు ఫుల్‌స్టాప్ పెట్టబడింది. విశ్వాసులారా, సేవకులారా - యేసు అనుచరుడవై, అనుచరురాలివై నీ జీవితంద్వారా నీ త్యాగంద్వారా కొందమందిలోనైన మార్పును కలుగచేస్తున్నావా? నీవల్ల దేశానికి, ఎవరికి ఎంత ప్రయోజనం కలుగుతోంది? దేవుడు మిమ్మును బహుగా ఆశీర్వదించి నీ త్యాగాన్ని అనేకులకు దీవెనగా చేయును గాక!!

**- మరనాత.**

# గమనించండి - సహకరించండి

**మీరు "మరనాత మెసేంజర్" పట్ల చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞులము. ముద్రణావ్యయము పెరిగిన కారణముగా జనవరి 2018 నుండి పత్రిక సాలుసరి చందా రూ.150/-కు పెంచడమైనది. గాన పాఠకులు గమనించి సహకరించగలరు. మీరు సాలుసరి చందా చెల్లించారా? లేనియెడల త్వరగా చెల్లించి పత్రికా పరిచర్యలో మీవంతు సహకారమును అందించండి, ప్రార్థించండి. మీ చందా పంపునప్పుడు యం.ఓ ఫారంలో సమాచారము కొరకు ఇవ్వబడిన స్థలములో మీ పేరు, పూర్తి అడ్రస్సు (ఇంటి నెంబరు, వీధిపేరు తప్పక రాయాలి మరియు మీ అడ్రస్సు మారినచో పాత, క్రొత్త అడ్రస్సులు పిన్ కోడ్ నంబరుతో సహా) వ్రాసి మీకు రిసిప్టులు, పత్రికలు పంపడంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి మాతో సహకరించ వలసినదిగా పాఠకులకు మనవి.**

**- ఎడిటర్స్ .**

# అభ్యర్ధన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., Ph.D.
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరీ
హైదరాబాదు. సెల్ : 9849746464

## యూదా రాజు - యెహోషాపాతు

**( 1 రాజులు 22 : 1-50 ; 2 రాజులు 3 అధ్యా॥ ; 2 దిన. 17 : 1 - 21 : 3 )**

అందరికి నమస్కారములు.

దేవుడనుగ్రహించిన దీవెనలను సంతోషంగా స్వీకరించటం చాలామందికి తెలుసు గాని, వాటిలో ఒదిగిఉండి భక్తి జీవితాలను జీవించటం చాలామందికి తెలియదు. తమకు లేనిది, ఊహించనిది దైవానుగ్రహంద్వారా సంక్రమిస్తే, అది వారి స్వార్జితమో, కష్టార్జితమో అన్నట్లు వ్యర్ధాలోచనలలోపడి అదుపును కోల్పోతున్నారు. దీవెనలు, స్వస్థతలు పొందుకోవటం ఎంత ప్రాముఖ్యమో వాటిలో నిలిచిఉండి దేవునిపట్ల, సంఘముపట్ల కృతజ్ఞత కలిగి కొనసాగటం అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యం.

యెహోషాపాతు యూదా రాజ్యమును పాలించిన 4వ రాజు (బి.సి. 871-849). ఇతడు మిశ్రమ భక్తిని జరిగించాడు. తనకు అవసరత, ఆపద వచ్చినప్పుడు మాత్రము దేవుని, దైవసేవకులను ఆశ్రయించటం, అవసరత లేనప్పుడు తనకు తోచినట్లుగా నిర్ణయాలు చెయ్యటం ఇతని అలవాటు. అయితే యెహోషాపాతు జీవితంలో జరిగిన ఓ ప్రధాన ఘట్టాన్ని ఈ సంచికలో పరిశీలిద్దాం.

2 దిన. 20 : 1-33 - ఈ విభాగమును పరిశీలించినప్పుడు యూదారాజ్యము పైకి మోయాబీయులు, అమ్మోనీయులు మరికొంతమందితో కలిసి దండెత్తివచ్చారు. ఈ సంగతి యెహోషాపాతు రాజుకు తెలియచేయబడింది. వెంటనే అతడు సైన్యమును యుద్ధసన్నద్ధులుగా చేయక దేవునిపై మనస్సు నిలుపుకొని యూదాదేశమంతా ఉపవాసమును ప్రకటించి ఓ గొప్ప ఆధ్యాత్మిక సంస్కృతిని నెలకొల్పాడు. ఇది నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించే అంశం. వ్యక్తులు, కుటుంబాలు ఉపవాసముండటం సహజంగాని, దేశం మొత్తం ఉపవాసముండి వారికెదురైన కష్టంలో ప్రార్ధించటం ఆలోచించవలసిన విషయం. సమస్యలొచ్చినప్పుడు పరిష్కారముల కొరకు వెతకటం మానవ సహజం. అయితే సంక్లిష్ట సందర్భాలలో దేవుని ఆశ్రయించి ఫలితాలు పొందటం వివేకం. యెహోషాపాతు ఉపవాసముండి దేవుని ప్రార్ధించిన విధము బహు విశేషమైనది. ఇది మామూలు ప్రార్ధన కాదు, క్లుప్తప్రార్ధన అంతకంటే కాదు. అది క్రైస్తవ ప్రపంచానికి మాదిరిగా నిలిచే ప్రార్ధనలలో ఒకటి. తన అవసరతను చెప్పి ప్రార్ధనను ఆరంభించకుండా, దేవుని ఔన్నత్యమును, ఆయన సార్వభౌమాధికారమును,

ఆయన ప్రజలపట్ల చూపించిన దయను మరియు చరిత్రలో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ దేవుని శ్లాఘించాడు. క్రైస్తవ ప్రపంచములో అనేకులకు ప్రార్థనచేయటం రాదు. ఇది వినటానికి కాస్త విడ్డూరంగా ఉన్నా అంగీకరించక తప్పదు. అనేక వ్యర్థమైన మాటలతో, అర్థంపర్థం లేని ఆలోచనలతో అసందర్భంగా, దీర్ఘంగా ప్రార్థించే భక్తులనబడిన వారు ఈనాటి సంఘాలలో లేకపోలేదు (మత్తయి 6 : 5). కొంతమంది ఉపవాసాలు, ప్రార్థనలు, ఉపన్యాసాలు వ్యర్థం. క్రైస్తవ భక్తి అర్థవంతమైన ఆధ్యాత్మిక పద్ధతులను అనుసరించి ఉండాలి గాని, మాపద్ధతింతే, మా అనుభవం వేరు, అని చెప్పుకుంటూ కొంతమంది ఆధ్యాత్మిక కార్యక్రమాలను వారికి తోచినట్లు లేఖనములను మలచుకొని అవమానకరంగా నడుచుకుంటున్నారు. అట్టివారు ఆ విషయములలో మారుమనస్సు పొందాలి.

యెహోషాపాతు చేసిన ప్రార్థన బహు గంభీరమైనది (2 దిన. 20 : 6-12). 6వ వ॥ - "మా పితరుల దేవా యెహోవా, నీవు ఆకాశమందు దేవుడవైయున్నావు... నీవు బాహుబలము గలవాడవు. పరాక్రమము గలవాడవు. నిన్నెదిరించుటకు ఎవరికిని బలము చాలదు" (ద్వితి 4 : 39; యెహోషువ 2 : 11; 2 రాజులు 8 : 23; 1 దిన. 29 : 11,12). తన అవసరతలో, దేవుని గొప్పతనాన్ని ముందుగా ప్రస్తావించి ప్రార్థనను ఆరంభించటం చాలా విశేషం. అంతేకాకుండా అబ్రహాము సంతతికి చేసిన వాగ్దానం శాశ్వతమైనది (ఆది 12 : 7; 17 : 7). 8, 9 వచనములలో "... కీడైనను, యుద్ధమైనను, తీర్పయినను, కరవైనను మామీదికి వచ్చినప్పుడు మేము ఈ మందిరము ఎదుటను నీయెదుటను నిలువబడి మా శ్రమలో నీకు మొఱ్ఱపెట్టిన యెడల నీవు ఆలకించి... నీ నామ ఘనత కొరకు... నీ పేరు ఈ మందిరమునకు పెట్టబడెను గదా." (2 దిన. 6 : 10; 1 రాజులు 8 : 30). దేవుని మందిరమునకు రాజులు, సామాన్యులు, సామంతులు యిచ్చిన గౌరవము ఎంతో హెచ్చైనది. దేవుని యందలి భయభక్తులతో దేవాలయమును ఆ కాలంలో సమీపించి ప్రార్థించేవారు. వారిలోని వినయ విధేయతలు ప్రస్తుత తరం గమనించి భక్తితో మసలుకోవాలి. కొంతమంది ఎందుకు ప్రార్థన చేయమంటారో తెలియని రోజులివి. టీ.వీ. కార్యక్రమంలో వచ్చిన ప్రతి నెంబరు వ్రాసుకొని, ఎవరికి ఫోన్‌చేస్తున్నారోకూడా తెలియకుండా, ఉచితమేగదా అని, బహు నిర్లక్ష్యముతో ప్రార్థనాఅవసరతలను కోరేవారు లేకపోలేదు! ప్రార్థనను కోరటం తప్పుకాదు గాని, ఖర్చులేదని సామాన్యమైన అవసరతను అందరికి చెప్పి ప్రార్థన చేయించుకోవలసిన అవసరము లేదుగదా...?! ఎవరికి వారు ప్రార్థించి, పరిష్కరించుకొనేవి కొన్ని, కుటుంబం ప్రార్థించి పరిష్కరించేవి కొన్ని, సంఘం ప్రార్థించి పరిష్కరించుకొనేవి మరికొన్ని. అంటే అవసరత స్థాయినిబట్టి ప్రార్థనావిన్నపముల పరిధి పెరుగుతుంది. అంతేగాని 10వ తరగతి పరీక్షలలో ఓ బాలిక, బాలుడు ఉత్తీర్ణత పొందటానికి కొన్నివందలమంది ప్రార్థన చెయ్యవలసిన అవసరము లేదు గదా?! అసలు వారు కుదురుగా కూర్చుని చదివితే దేవుడు వారికి సహాయంచేస్తాడు. ఎవరికి వారు, వారు చేయవలసిన ప్రార్థనను జరిగించకుండా దేశమంతా వారి అసవరత కొరకు ప్రార్థించాలనుకోవటం విచిత్రం. ప్రపంచ విమోచన కొరకు ప్రార్థించటం వేరు. అవసరత స్థాయినిబట్టి విస్తృత

ప్రార్ధనను కోరటం వేరు. ఉచితమేగదా అని మనం పరిష్కరించుకునే స్థాయిలో ఉన్నవాటిని కూడా వేరొకరికి తరలించటం ఆధ్యాత్మిక విడ్డూరం..?!

ఫోనులో ప్రార్ధనలు, లైవ్‌లో ఆరాధనలు చూడటం మంచిదేగాని, ఒకవేళ ప్రార్ధనా మందిరానికి వెళ్ళి దైవదాసుల ప్రార్ధనలు కోరటం మంచిది. వెళ్ళలేని స్థితిలో ఉన్నవారు ఫోన్లో ప్రార్ధనలు చేయించుకోవటం, దూరాభారాన్ని బట్టి లైవ్‌లో ఆరాధనలు తిలకించటం కొంతవరకు ప్రయోజనం. అయితే ప్రార్ధనా మందిరానికి వెళ్ళగలిగిన అవకాశం ఉన్నవారు వెళ్ళి ప్రార్ధనలు కోరటం, ఆరాధనలలో పాల్గొనటం మంచిది. ఇక్కడ యెహోషాపాతుకు వచ్చిన సమస్య దేశానికి సంబంధించినది గనుక యూదా వారందరు ఉపవాసము ప్రకటించి ప్రార్ధించారు. అంటే జాతీయ సమస్యలు, అంతర్జాతీయ సమస్యల కొరకు అందరి ప్రార్ధనలు అవసరం.

1 దిన. 20 : 12, 13 - "... ఈ గొప్ప సైన్యముతో యుద్ధము చేయుటకు మాకు శక్తి చాలదు. ఏమి చేయుటకును మాకు తోచదు, నీవే మాకు దిక్కు అని ప్రార్ధన చేసెను. యూదావారందరును తమ శిశువులతోనూ, భార్యలతోను, పిల్లలతోను యెహోవా సన్నిధిని నిలువబడిరి". ఇది ఓదేశ సంపూర్ణ విధేయతకు సూచన. ప్రతి కుటుంబము దేవుని సన్నిధిలో పసిపిల్లలతో కూడ వచ్చి వారి దేశభద్రత కొరకు ప్రార్ధించారు. నీనెవె పట్టణస్థులు కూడా ఈ విధంగానే యోనా చేసిన ప్రకటనకు స్పందించారు. ఇంకా నలువది రోజులలో దేవుని ఉగ్రత నీనెవె పట్టణస్థులు చేసిన పాపము వలన రాబోతోందని యోనా ప్రకటించినప్పుడు యోనా 3 : 5,6,9,10 లో "నీనెవె పట్టణపువారు దేవునియందు విశ్వాసముంచి ఉపవాస దినము చాటించి, ఘనులేమి, అల్పులేమి గోనెపట్ట కట్టుకొనిరి... తన సింహాసనమునుండి దిగి, తన రాజవస్త్రములు తీసివేసి గోనెపట్ట కట్టుకొని బూడిదలో కూర్చుండెను... మనుష్యులందరు తమ దుర్మార్గములను విడిచి... మనుష్యులేమి, పశువులేమి సమస్తమును గోనెపట్ట కట్టుకొనవలెను..." ఇది నిజంగా దేశంలో వచ్చిన సంస్కరణ. ఆమాటకొస్తే ఏ దేశానికైనా ఇలాంటి పశ్చాత్తాపము అవసరము. భౌతిక యీవులను పొందుకోవటానికి ప్రార్ధనలు, ఉపవాసములు అవసరమేగాని, దేశ, ప్రపంచ విమోచన కొరకు నిజముగా ప్రార్ధించటం అత్యవసరం. దేవుడు గొప్పగా నీనెవె ప్రజలను సంరక్షించాడు.

2 దిన. 20 : 14 - "... యహజీయేలు సమాజములో ఉండెను. యెహోవా ఆత్మ అతనిమీదికి రాగా... యూదావారలారా, యెరూషలేము కాపురస్థులారా, యెహోషాపాతు రాజా... ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి, జడియకుడి, యీ యుద్ధము మీరు కాదు, దేవుడే జరిగించును". (నిర్గమ 14 : 14; ద్వితి. 20 : 1; 2 దిన. 32 : 7) దేశం మొత్తం ప్రార్ధించగానే దేవుడు జోక్యం చేసుకున్నాడు. యహజీయేలు ద్వారా దేవుడు మాట్లాడాడు. ప్రజలందరు ధైర్యం పొందారు. దేవుని మాట వారందరికి బలాన్నిచ్చింది. బ్రతుకుపై ఆశలను చిగురింపచేసింది. అందుకే దేవుని మాటను వినాలి, నిజముగా దేవుని మాట వినబడే స్థలానికి వెళ్ళాలి. అందరూ దేవుని సన్నిధిలో సాగిలపడి నమస్కరించి గొప్ప శబ్ధముతో స్తుతించారు (2 దిన. 20 : 19).

యెహోషాపాతు నిలువబడి "... యెరూషలేము కాపురస్థులారా నామాట వినుడి,

మీ దేవుడైన యెహోవాను నమ్ముకొనుడి అప్పుడు మీరు స్థిరపరచబడుదురు. ఆయన ప్రవక్తలను నమ్ముకొనుడి అప్పుడు మీరు కృతార్థులగుదురని చెప్పెను" (2 దిన. 20 : 20). 'కృతార్థులగుదురు' అను మాటకు అసలు అర్థం 'వర్ధిల్లుదురు'. దేవుని విశ్వసించటం ఎంతో ప్రాముఖ్యము. అయితే దేవుడు నియమించిన ఆధ్యాత్మిక వ్యవస్థలోని దైవసేవకులను గౌరవించటం ప్రాముఖ్యం. అయోగ్యులై, తమకిష్టమైన రీతిలో దేవుని సేవలు జరిగిస్తున్న వారిని వినహాయించి, యోగ్యులైన దైవసేవకులను గుర్తించి గౌరవించటం, క్రైస్తవుల ధర్మం. చాలామంది విశ్వాసులు యోగ్యులైనవారిని కూడా విమర్శిస్తూ కీడును కొని తెచ్చుకుంటున్నారు. వారు విన్నది, కొంతమంది చెప్పినవన్నీ రైటైనట్లు భావించటం తగదు. ఆమాటకొస్తే మనగురించి కూడా యితరులు ఉన్నవి లేనివి మాట్లాడితే మనకు కూడా బాధ కలుగుతుంది గదా..?! అలాంటప్పుడు మనకు ఏవిధంగానూ సంబంధం లేని యోగ్యులైన దైవసేవకులను అపార్థంచేసుకొని, అనవసరంగా విమర్శించటం శాపకారణం కాగలదు..? మనస్సులను అదుపులో ఉంచుకోవటం ఆశీర్వాదం.

ప్రవక్తలను నమ్ముకొనుడి అంటే వారు బోధించే దేవుని వాక్యమును నమ్ముకొనుడని అర్థం. అప్పుడు ప్రజలు వర్ధిల్లుతారు. 1 పేతురు 2 : 15, 16 - "... అజ్ఞానముగా మాటలాడు మూర్ఖుల నోరు మూయుట దేవుని చిత్తము... దుష్టత్వమును కప్పిపెట్టుటకు మీ స్వాతంత్ర్యమును వినియోగపరచక దేవునికి దాసులమని లోబడియుండుడి". హెబ్రి 13 : 17 - "... ఆనందముతో చేయునట్లు వారి మాట విని వారికి లోబడియుండుడి". 1 థెస్స. 5 : 12-13 - "... ప్రయాసపడుచు ప్రభువు నందు మీకు పైవారైయుండి మీకు బుద్ధిచెప్పువారిని మన్ననచేసి... ప్రేమతో మిక్కిలి ఘనముగా ఎంచవలెనని వేడుకొను చున్నాము". హెబ్రి 13 : 7 - "మీకు వాక్యము బోధించి, మీపైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము చేసుకొని... వారి విశ్వాసము ననుసరించుడి". అర్హులు, యోగ్యులైన దైవ సేవకులు, అట్టి సేవలో సహకరించేవారెప్పుడూ గౌరవానికి పాత్రులు. గనుక మీరు వెళ్ళు సంఘములలో నాయకులుగా ఉన్నవారిని గౌరవించండి. తద్వారా వర్ధిల్లటానికి కారణమౌతుంది. అట్టి ధోరణి మన భక్తి జీవితంతోపాటు ప్రవర్తనలో పరివర్తన ఆశ్చర్యకరమైన ఆశీర్వాదాలను తెచ్చిపెడుతుంది.

2 దిన. 20 : 21-26 - దేవుని అభ్యర్థించి, ఆ దేవుడు చెప్పినట్లు చేసినందున మరియు గాయకులు దేవుని స్తుతిస్తూ, పాడుతూ, ప్రార్థిస్తూ ఉండగా మోయాబీయులు, అమ్మోనీయులు ఒకరికిఒకరు పొడుచుకొని చనిపోయిరి. యూదాదేశపు రాజు, ప్రజలు వచ్చి చూచినప్పుడు శత్రువులందరూ నేలకూలారు. కారణం యూదా సైనికులు యుద్ధము చేసినందున కాదు. దేవునిమాట వినిన రాజు, మరియు ప్రజలు దేవుని మాటకు విధేయులైనందున దేవుడే దేవునిప్రజల పక్షముగా యుద్ధముచేశాడు. యెహోషాపాతు జీవితంలో పలు చీకటి ఘట్టాలు ఉన్నా, ఈ విషయంలో అతడు దేవునికిచ్చిన ప్రాధాన్యత, విధేయత మరియు చేసిన ప్రార్థన గమనార్హం. రాజులు దేవుని మాట విన్నారు. ఈరోజుల్లో చాలామంది సామాన్యులు తమ్మును ఎక్కువగా ఊహించుకొని దేవునిమాట వినటం, ప్రార్థనా మందిరానికి రావటం నామోషీగా భావిస్తున్నారు. చాలామంది భౌతికంగా చురుకైనవారైనా,

ఆధ్యాత్మికంగా బహు అమాయకులైనందున దేవుని సంగతులు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఆరోజుల్లోఉన్న ఆనవాయితీనిబట్టి యూదారాజ్యంపై దండెత్తి దేవుని ఉగ్రతను పొంది నశించినవారి సొమ్ములు యూదాదేశవాసుల పరమయ్యాయి. ఆసొమ్ములను స్వీకరించటానికి వారికి మూడు రోజుల సమయం పట్టింది (2 దిన. 20 : 25).

2 దిన. 20 : 26 - "నాల్గవ రోజున వారు బెరాకా లోయలో కూడిరి. అక్కడ వారు యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించినందున నేటివరకు ఆచోటుకి బెరాకాలోయ అని పేరు". మొత్తానికి నాలుగవరోజున స్తుతికూటం పెట్టుకున్నారు. ఇది నిజంగా దేవుడు చేసిన అద్భుతం. ఎలాంటి ఆయుధాలు లేకుండా కేవలం దేవునికి ప్రార్థించి, ఆయన చెప్పినట్లు చేసి ఆశీర్వాదం యెహోషాపాతు మరియు యూదాప్రజలు పొందుకున్నారు. దేవుని అభ్యర్థించి, ఆ దేవుని సూచనలు ఆచరించి ఆశీర్వాదం పొందుకుందాం.

## - : సవరణ : -

*సెప్టెంబరు **2019** మరనాత మెసేంజరు సంచికలో ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక-**23** వ్యాసం, పేజీ నెంబరు **12** రెండవ పేరా ఆరంభములో (బ్రాకెట్స్ లోపల 'ఆ కాలమున బబులోను అష్షూరీయుల ఆధీనములో ఉన్నది') అని పొరపాటున ప్రస్తావించటం జరిగింది. అయితే ఆ కాలములో బబులోను పర్షియన్ల (పారశీకుల) ఆధీనములో ఉన్నట్లు పాఠకులెల్లరు గమనింప ప్రార్థన.*

# సంగీత, సాహిత్య ప్రియులకు మరో శుభవార్త

డా॥ నిరీక్షణ కె. కంచర్లగారి కలం నుండి వెలువడిన, నిరీక్షణ మెలోడీస్ సమర్పణలో వాల్యూం-4 "**ప్రేమాంజలి**" గీతమాలికను మరనాత విశ్వాస సమాజం, హైదరాబాదు ద్విదశ వార్షికోత్సవ సభలో వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారి ఆశీస్సులతో ఆగష్టు 08, 2019 న ఆవిష్కరించటమైనది.

అందులో "**ప్రేమాంజలి**" పాటలతోపాటు, యింతకు ముందు మేము రూపొందించిన ఆత్మాంజలి, హృదయాంజలి, స్తోత్రాంజలి గీతమాలికలు మరియు మాన్యశ్రీ మోజెస్ చౌదరి గారి ప్రసంగాలు, డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి ప్రసంగాలు అందించటమైనది. ఈమారు కూడా మీ సౌకర్యార్థం 16 జి.బి. పెన్‌డ్రైవ్‌లో పైన ప్రస్తావించిన పాటలు, ప్రసంగాలు పొందుపరచాము. కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలసినదిగా మనవి. మీ పూర్తి అడ్రస్సు, ఫోన్ నెంబరుతో రూ.399/-లు పంపి కొరియర్ ద్వారా పొందగలరు.

**గమనిక : రూ. 500/- లు వెల గల 16 జి.బి. పెన్‌డ్రైవ్ ద్విదశ వార్షికోత్సవ సందర్భంగా రూ. 399/- లకు అందించబడుచున్నది గాన త్వరపడండి.**

**-: BANK DETAILS :-**
**ORIENTAL BANK OF COMMERCE**
**MARANATHA VISVASA SAMAJAM**
**SB. A/c.No.10932011013854**
**IFSC : ORBC0101093**




**డా॥ నిరీక్షణ కె. కంచర్ల**
మరనాత గ్రౌండ్స్, 12-7-133/81/2/1
రాఘవేంద్ర నగర్, కుకట్‌పల్లి
హైదరాబాదు-500 072.
సెల్ : 98497 46464

# మార్గదర్శి

**సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

క్రీస్తు నామములో మరనాత మెసేంజర్ పాఠకులకు శుభములు. గుమ్మములారా మీ తలలు పైకెత్తుకొనుడి. పురాతనమైన తలుపులారా మహిమ గల రాజు ప్రవేశించునట్లు మిమ్మును లేవనెత్తుకొనుడి. మహిమ గల ఈ రాజు ఎవడు? సైన్యములకధిపతియగు యెహోవాయే. ఆయనే ఈ మహిమగల రాజు (కీర్తన 24 : 9-10). ప్రతి గృహానికి గుమ్మం అవసరం. ద్వారం లేకుండా ఇల్లు కట్టరు. పురాతన ఇశ్రాయేలీయుల చరిత్రను పరిశీలిస్తే, గుమ్మములు ప్రత్యేక స్థానాన్ని కలిగియున్నాయి. గుమ్మముల యొద్దనే వ్యాపార సంబంధ క్రయవిక్రయాలు జరిగేవి. అంతేకాక శత్రువులు బారినుండి తమ రాజ్యాలను, ప్రాంతాలను కాపాడుకోటానికి గుమ్మములు వినియోగించేవారు. యేసుక్రీస్తు కూడా అందరికి సుపరిచితమైన ద్వారం అనే మాటను ఉపయోగిస్తూ, నేనే గొఱ్ఱెలకు ద్వారము (యోహాను 10 : 7) అని సెలవిచ్చాడు. దేవునియొద్దకు చేరటానికి మార్గదర్శి యేసుక్రీస్తు. మరోమారు కీర్తనాకారుడు ఇలా అన్నాడు - కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములలో ప్రవేశించుడి. కీర్తనలు పాడుచూ ఆయన ఆవరణములో ప్రవేశించుడి (కీర్తన 100 : 4). దేవుని యొద్దకు ప్రజలు ఏవిధముగా రావాలో, ఏవిధముగా దేవుని ఆరాధించాలో లేఖనాలు స్పష్టంగా తెలియచేస్తున్నాయి. మనము దేవుని ఇంటిలోనికి ఏ విధముగా ప్రవేశించాలంటే,

**తలలు పెకెత్తుకొని ప్రవేశించాలి (యోహాను 5 : 1-9) :-** మనమున్న స్థితిలో నుండి పెకెత్తబడి దేవున్ని ఆరాధించుటయే తలలు పైకెత్తుకొనుట. అందుకే కీర్తనాకారుడు పెంటకుప్పలనుండి దీనులను పైకి లేవనెత్తువాడు దేవుడే అని అన్నాడు. మన తలను పైకెత్తువాడు దేవుడే. యేసుక్రీస్తు భూలోకములో పరిచర్య చేస్తున్నప్పుడు, ఒకానొక పండుగ సమయంలో యెరూషలేముకు వచ్చాడు. దేవాలయమునకు సమీపమునన్నున్న బెతెస్థ అను ఒక ద్వారము నొద్దకు యేసు విచ్చేసాడు. ఈ ద్వారమునే గొఱ్ఱెల ద్వారమని కూడా పిలిచేవారు. ఇచ్చట అనేక రకాల వ్యాధులతో బాధపడేవారు ఉండేవారు. కోనేటికి సమీపంలో వారుండుటకు కారణమేమనగా, ఆ నీళ్ళలో మునుగుటవలన స్వస్థత ఉందని నమ్మేవారు. ఎందుకంటే ఆ నీళ్ళు కొన్నిమార్లు కదిలించబడినప్పుడు ఎవరైతే ఆనీటిలో దిగుతారో వారు స్వస్థతనొందుతారనే నమ్మకం వారికి ఉంది. నీరు ఒరవడిగా ప్రవహిస్తున్నప్పుడు నీరు కదిలించబడినట్టు కన్పించేది. అయితే వారు దేవదూత వచ్చిఆ నీటిని కదిలించునని విశ్వసించేవారు. కనుకనే స్వస్థత నిమిత్తము పలువిధ వ్యాధిగ్రస్తులు అక్కడ వేచివుండేవారు. అయితే వాస్తవానికి ఆ కోనేరు క్రింద మధ్యదరా సముద్రము యొక్క పాయ ప్రవహిస్తూండేది. అంతేకాక ఆనాటి గ్రీకు, రోమా ప్రజలు నీటికి స్వస్థత శక్తి ఉందని నమ్మేవారు. ఎప్పుడైతే యేసు యెరూషలేముకు వచ్చారో చాలామంది రోగులు ఆ కోనేటిదగ్గర పడియుండుట చూచాడు కాని యేసు

దృష్టి 38 సంవత్సరాలనుండి వ్యాధితో పడియున్న రోగిపై పడింది. ఆ వ్యక్తి 38 సంవత్సరాల వయస్కుడో లేక అంతకంటే పెద్దవాడో మనకు తెలియదు. ఆ రోగివంక చూడగానే యేసు మనస్సు తరుక్కుపోయింది. పడిపోయిన ఆజీవితాన్ని బాగుచేయటానికి యేసు జాలిచూపాడు. పరిశుద్ధ పట్టణంగా పేరుగాంచిన యెరూషలేము 38 సంవత్సరాలనుండి ఆ వ్యక్తికి ఉండటానికైతే కొన్తంత చోటునైతే ఇవ్వగల్గింది కాని అతన్ని స్వస్థపరచలేకపోయింది. బంధించబడినవారిని విడుదల చేయుటకే యేసు భూలోకానికి వచ్చాడు (లూకా 4 : 18). కనుకనే అతని జీవితాన్ని పట్టిపీడిస్తున్న బాధను తీసివేయటానికి యేసు అతని దగ్గరకు వెళ్ళి - నీవు స్వస్థపడగోరుతున్నావా? అని ఒక్క ప్రశ్న వేశాడు. ఆ వ్యక్తికి స్వస్థత అవసరమని ఎరిగియూ, యేసు అతని మనస్సులోని మాట వినేందుకు ఆ ప్రశ్న వేశాడు. నిరాశతో కృంగిన ఆ వ్యక్తి స్వస్థత పొందిన తరువాత నా జీవితం గడుపుకోవటం కష్టం కనుక స్వస్థత నాకవసరం లేదు అంటాడో, అయినా నాగురించి మీకెందుకులేండి అంటాడో అని అతని సమాధానాలు వినడం కోసం ఆ వ్యక్తిని యేసు ప్రశ్నించాడు. కనీసం అప్పటివరకు తన గురించి పట్టించుకున్నవారే లేరు. కాని యేసు ప్రశ్నతో అతని మనస్సు ఉరకలేసింది. కనుక తడవుచేయకుండా యేసు అడిగిన ప్రశ్నకు మూడు సమాధానాలు చెప్పాడు. తన ముందున్న వ్యక్తిని గౌరవానికి పాత్రుని ఎంచి అయ్యా అంటూ సంబోధించాడు. యేసును గౌరవించిన పిదప తనకున్న సమస్యలను ఏకరువు పెట్టాడు. తనకు సహాయం చేయటానికి ఎవరు లేరనియూ, తనకంటే ముందుగా ఎవరో ఒకరు కోనేటిలో దిగుతున్నారనియూ, తాను ప్రయత్నం చేసినా విఫలమైనట్లు తన అపజయాన్ని ఒప్పుకున్నాడు. అప్పటివరకు నీళ్ళే సర్వస్వం అనుకున్న నిత్యకాల రోగికి, ఔషధ సృష్టికర్తయైన యేసు కన్పించేసరికి తనలోనున్న బాధలను చెప్పుకున్నాడు. శరీరానికి వచ్చిన రోగం కంటే మనస్సులోని బాధ వర్ణనాతీతం కనుక యేసుముందు నోరువిప్పాడు. తన తలను పైకెత్తగల్గిన యేసు రావటంతో ఈ 38 సంవత్సరాల రోగికి పండుగ రోజయ్యింది. ప్రజలను రక్షించే సృష్టికర్తకే తన గోడునంతా వివరించాడు. ఇవన్నీ విన్నతరువాత యేసు పడిపోయిన ఆ జీవితాన్ని లేవనెత్తకుండా ఉంటాడా?

ఎప్పుడైతే ఆ రోగి యేసుకు సమాధానమిచ్చాడో వెంటనే యేసు - నీవు లేచి నీ పరుపెత్తుకొని నడువుము అన్నాడు. ఆపనే చేయగలిగితే ఇక్కడ ఉండేవాడు కాదని యేసుకు తెలియదా? నేను పరుపును మోయగలిగితే ఇక్కడ ఎందుకుంటానని ఆ వ్యక్తి సహితం ప్రశ్నించలేదు. వెంటనే ఆ రోగి స్వస్థతనొంది పరుపెత్తుకొని నడిచాడు. ఎన్నో పండుగలు వచ్చాయి, ఎంతోమంది ప్రజలను చూచాడు కాని అసలుసిసలైన పండుగ 38 సంవత్సరాల తరువాత ఈ వ్యక్తికి వచ్చింది. 38 సంవత్సరాలు ఆకాశాన్నే చూచాడు, నీటిని చూచాడు కాని 38 సంవత్సరాల తరువాత సృష్టికర్తయైన యేసును చూచాడు అంతే 38 సంవత్సరాల రోగం, 38 సెకండ్లలో తొలగిపోయిందని నేనంటాను! అవును కదా, అది యేసు ద్వారానే సాధ్యమయ్యింది. ఎప్పుడూ తల దించుకొని నీళ్ళవైపే చూచే ఈ రోగిని తలపైకెత్తుకొని

**( మిగతా 20 వ పేజీలో.. )**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక
## ( 14 వ భాగము )

రెవ. అల్లూరి. విశ్వప్రసాద్, విజయవాడ

## జ్ఞానముతో నడుచుట : (ఎఫెసీ 5 : 14-17)

**పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమలో వందనములు శుభములు !**

**"అందుచేత - నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని ఆయన చెప్పుచున్నాడు. దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి. ఇందు నిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువుయొక్క చిత్తమేమిటో గ్రహించుకొనుడి."**

దేవుడు ప్రేమయైయున్నాడు, సత్యమైయున్నాడు, వెలుగైయున్నాడు, జ్ఞానమునకు మూలమైయున్నాడు. ఇవన్నీ దేవుని పరిశుద్ధతయొక్క లక్షణములు. కాబట్టి దేవుని సేవించువారు ఆయన ప్రేమలోను, సత్యములోను, వెలుగులోను వెలుగు సంబంధులవలె నడవాలి. దేవుడు అనంతజ్ఞాని కాబట్టి ఆ జ్ఞానమును మనంకూడ పొందుకోవాలి. అది లోకసంబంధమైన జ్ఞానముకాదు, దేవుని జ్ఞానము మనకు చాలా అవసరమని చెబుతూ ఆ జ్ఞానములో వివేచనతో ఎలా నడుచుకోవాలో 15,16,17 వచనాలలో తెలియచేస్తున్నాడు. మన నిర్ణయాలు, స్పందించేవిధం, మాటలు చాలా వివేకయుతంగా ఉండాలి. ఇట్టి జ్ఞాన, వివేచనలను దేవునియొద్దనుండి మనం పొందుకోవాలి. వివేచనతో, జ్ఞానముతో నడుచుకొనకపోతే మనం ఏమవుతామో ఇక్కడ చెబుతున్నాడు.

**1. నిద్రించుచున్ననీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని.. :** అపో. పౌలు ఇక్కడ విశ్వాలులకు - మీరు ఐక్యతలోను, పవిత్రతలోను, దేవుని వెలుగులోను, దేవుని ప్రేమలోను, దేవుని జ్ఞానములోను మీరు నడుచుకొనండి అని, నిద్రమత్తులో జీవించకూడదని చెబుతున్నాడు. నిద్రించుచున్న నీవు మేలుకో. లెమ్మా అంటున్నాడు. పౌలు ఇక్కడ మన నడత, మాట, జీవితవిధానముగురించి చెబుతున్నాడు. మన జీవిత విధానము ఖచ్చితంగా ఉండాలి, స్పష్టంగాఉండాలి, జాగ్రత్తగా ఉండాలి. కొన్నిసార్లు మన పనులు, మాటలు నిద్రమొహంగానే అనిపిస్తాయికదా! విశ్వాసులు ఆధ్యాత్మిక మత్తును విడిచి లేచినప్పుడు మీ జీవితాన్ని ప్రభువుకు సమర్పించుకున్నప్పుడే అన్నివిషయాలలో మెలకువకలిగిన స్థితిలో ఉంటారు. **"మరియు మీరు కాలమునెరిగి, నిద్ర మేలుకొను వేళయైనదని తెలిసికొని, ఆలాగు చేయుడి. మనము విశ్వాసుల మైనప్పటికంటె ఇప్పుడు, రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నది. రాత్రి చాల గడచి పగలు సమీపముగా ఉన్నది**

**గనుక మనము అంధకార క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొందము" (రోమా 13 : 11).** మనము రక్షింపబడిననాటి కంటె ఇప్పుడు రక్షణ మరింత సమీపముగా ఉంది. ఎంత ఆశీర్వాదకరమైన వచనమును ఇక్కడ దేవుడు మనకిచ్చాడు! విశ్వాసులమైన మనము ప్రార్థించుటలోను పరిచర్యచేయుటలోను ఆత్మలను సంపాదించే విషయములోను కడు జాగ్రత్తను, వివేకమును కలిగిఉండాలి. ఎంతో మెలకువకలిగిన స్థితిలోఉండాలి. పౌలు భక్తుడు మెలకువ కలిగియుండుటను గూర్చి ఎఫెసి సంఘానికి చెప్పాడు, రోమా సంఘానికి చెప్పాడు. మరియు థెస్సలొనీక సంఘానికి చెబుతూ - **"మీరందరు వెలుగు సంబంధులును పగటి సంబంధులునై యున్నారు; మనము రాత్రివారముకాము, చీకటివారము కాము. కావున ఇతరులవలె నిద్రపోక మెలకువగా ఉండి మత్తులముకాక యుందము. నిద్రపోవువారు రాత్రివేళ నిద్రపోవుదురు, మత్తుగా ఉండువారు రాత్రివేళ మత్తుగా ఉందురు" (1 థెస్స 5 : 5,6).** నిద్రపోయేవారు రాత్రివేళే నిద్రపోతారు. కాని, అనేకులు పగలుకూడ నిద్రావస్థస్థితిలో ఉంటున్నారు, ఈలోక సంబంధులైన సుఖాలకు అలవాటుపడు తున్నారు. అట్టివారికి పౌలు - లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశిస్తాడు అని చెబుతున్నాడు.

నిజమైన సువార్తను అందించే సంఘాలు నిద్రపోరు. ఈ లేఖనాలద్వారా వ్యక్తిగతంగాను, సంఘములతోను దేవుడు మాట్లాడుతున్నాడు. మనము పొందిన రక్షణను, స్వస్థతను, ఆశీర్వాదమును ఇతరులకు అందించగలుగుతున్నామా? అందించలేనప్పుడు నిద్రలో ఉన్నట్లే! క్రైస్తవులు ఎన్నడూ నిద్రపోయేవారిగా ఉండకూడదు. అపవాది ఎన్నడూ నిద్రపోడు. విశ్వాసులను ఇబ్బందులు పెట్టడానికి తిరుగుతూనే ఉంటాడు. విశ్వాసులు కుటుంబములో ప్రతికూలపరిస్థితుల్లో, అనారోగ్యాల్లో, సమస్యల్లో నిద్రపోతారా? కాని, అన్నీ బాగున్నప్పుడు విశ్వాసులు నిద్రపోయేవారిగా ఉంటున్నారు. ఆత్మసంబంధమైన సంగతులవిషయంలో మీరు మెలకువకలిగి ఉండాలని ఇక్కడ స్పష్టంగా చెబుతున్నాడు. అందుచేత అనుదినం మనం దేవునిమీద ఆధారపడుతూఉండాలి.

## 2. "దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచూ అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ 5 : 15) :

జ్ఞానము గలవారికి ఉండవలసిన చిహ్నాలు ఏమిటి? అనేది లేఖనముల నుండి చూస్తే, ఓడను నడిపించే నావికుడు చాలా జాగ్రత్తగా నడపాలి. గాలిని వాతావరణాన్ని అలలనుబట్టి వివేకయుతంగా నడిపిస్తేనే అది క్షేమముగా గమ్యానికి చేరుతుంది. జ్ఞానము కలిగిన మనిషి తన మార్గాన్ని ముందే ప్రణాళిక వేసుకుంటాడు. తన మార్గమును ముందే ఎరిగిఉంటాడు. విశ్వాసులు ఎంత తెలివిగా కుటుంబాన్ని నడిపించుకోగలుగుతారో, మీ విశ్వాసాన్ని ఎంతగా కాపాడుకోగలుగుతారో చెబుతున్నాడు. ప్రతిఒక్కరూ వారి కుటుంబాన్ని

కాపాడుకొనే జ్ఞానమును దయచేయుమని దేవున్ని అడగండి. 'జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టుకొంటుంది, మూఢురాలు తన ఇల్లు ఊడబెరుకుతుంది'. అలాగే, 'స్త్రీ బలహీనమైన ఘటమని ఎరిగి పురుషుడు జ్ఞానము చొప్పున ఆ స్త్రీతో కలిసిఉండాలి'. కుటుంబములో భార్యభర్తలు ఇరువురికి జ్ఞానము అవసరము. పిల్లలకు జ్ఞాన వివేకములు కావాలి. **"మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును" (యాకోబు 1 : 5).**

విశ్వాసులైనవారు విశ్వాసము విషయములో ఎలా ఉంటున్నారు, అవకాశాలను ఎంతగా సద్వినియోగం చేసుకొంటున్నారు అనేది చాలా ప్రాముఖ్యమైనది. మనము ప్రతిదినము దేవునిమీద ఆధారపడుతూ ప్రణాళిక వేసుకోవాలి. **"నేడైనను రేపైనను ఒకానొక పట్టణమునకు వెళ్లి అక్కడ ఒక సంవత్సరముండి వ్యాపారముచేసి లాభము సంపాదింతము రండని చెప్పకొనువారలారా, రేపేమీ సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైనపోవు ఆవిరి వంటివారే. కనుక- ప్రభువు చిత్తమైతే మనము బ్రదికియుండి ఇది అది చేతమని చెప్పకొనవలెను. ఇప్పడైతే మీరు మీ డంబములయందు అతిశయపడుచున్నారు. ఇట్టి అతిశయమంతయు చెడ్డది. కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును" (యాకోబు 4 : 13-15).**

ఒక్కొక్కసారి ప్రణాళిక వేసుకొన్న, వేసుకోనకపోయిన ఊహించని సంఘటనలు జరుగుతాయి. మనం ప్రతివిషయములోను దేవునిచిత్తమునకు అప్పగించుకోవాలి. మనం ఎక్కడికి వెళుతున్నామో ఏమిచేస్తున్నామో మనం ఎరిగినవారమై ఉండాలి. మన పనిలో, బాధ్యత లలో ఎంతో వివేకయుతంగా ఉండాలి. ఓడనావికుడైన, విమానం నడిపే పైలెట్ గాని ఎవరైన వాటిని వాళ్లు ఎక్కడికి నడిపిస్తున్నారో వారు ఎరిగిఉండకపోతే ఎటుబడితే అటు వెళ్లిపోయే ప్రమాదంఉంది. ఎక్కడోఒకచోట పడిపోయే ప్రమాదం, మునిగిపోయే ప్రమాదం ఎంతో ఉంది. అలాకాకుండా ఉండాలని మనవిచేస్తున్నాను. **"జ్ఞానము సంపాదించుకొనుటయే జ్ఞానము నకు ముఖ్యాంశము. నీ సంపాదన అంతయు ఇచ్చి బుద్ధి సంపాదించుకొనుము (సామెతలు 4 : 7). "మీలో జ్ఞాన వివేకములు గలవాడెవడు? వాడు జ్ఞానముతోకూడిన సాత్వికముగలవాడై, తన యోగ్య ప్రవర్తనవలన తన క్రియలను కనుపరచవలెను" (యాకోబు 3 : 13).**

ఎవరైన మత్సరములు, వివాదములు, సర్దుబాటు చేసుకోలేని మనస్తత్వము కలిగియుంటే వారు జ్ఞానముకలవారా? అట్టివారికి తెలివి, వివేచన ఉందా? మత్సరములు లోపల పెట్టుకొని ప్రతిదానికి వివాదములు, సమస్యలు సృష్టించేవారు జ్ఞానవంతులు కాదు. మత్సరములు, వివాదములు, అతిశయములను హృదయములో కలిగియుండకూడదు. **"అయితే మీ హృదయములలో సహింపనలవికాని చేదైన మత్సరమును వివాదమును ఉంచుకొనినవారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు" (యాకోబు 3 : 14). అట్టి కృపను దేవుడు మనకు అనుగ్రహించును గాక!**

# I కొరింథి పత్రిక ధ్యానములు - 3

( గత సంచిక తరువాయి.. ) **రెవ. గొట్టిపాటి యేసుదాసు, రేపల్లె**

పాఠక మహాశయులకు క్రీస్తు ప్రభువు నామములో శుభాభివందనములు.

**క్రీస్తును, ఆయన శరీరమైన సంఘాన్ని విభజించలేరు :-** సంఘాన్ని గిలిబిలి చేయువారిని చూస్తున్న విశ్వాసులు ఈసంగతిని గ్రహించాలి. ఒకరినొకరు అర్థముచేసుకుని, క్రీస్తులో వారికున్న ఐక్యతను కాపాడుకోవాలి. క్రీస్తుతో పోల్చితే ఈలోకములో ఎంతటి ఘనులైనా సరిపోరు. కనుక సంఘములో ఏమనిషినీ గొప్పవానిగా ఎంచరాదు. ఎవరూ తనను హెచ్చించు కోరాదు. విభజించే ప్రయత్నము చేయరాదు. క్రీస్తు విభజింపబడియున్నాడా? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తీస్మము పొందితిరా? అనేది మనుషులను హెచ్చించువారికి పౌలువేసే ప్రశ్న. అందుకే ఏకొద్దిమందికో తప్ప నేనెవరికి బాప్తీస్మమియ్యలేదు అంటున్నాడు. క్రిస్పు,గాయియు, స్తెఫను ఇంటివారికి బాప్తీస్మ మిచ్చాను. బాప్తీస్మమిచ్చుటకు క్రీస్తు నన్ను పంపలేదు కానీ క్రీస్తు సిలువ వ్యర్థము కాకుండునట్లు, వాక్చాతుర్యము లేకుండ సువార్త ప్రకటించుటకే ఆయన నన్ను పంపెను (1 కొరింథి 1 : 13-17).

**బాప్తీస్మము :-** మనిషి రెండువిధాల పాపి. 1) జన్మ పాపము, అనగా, తల్లిదండ్రుల రక్తము నుండి బిడ్డలలోనికి సంక్రమించే పాపం. 2) ఖర్మ పాపము, అనగా, ఊహతెలిసిన నాటినుండి సమాజములో ఆలోచనతోనూ, క్రియలతోనూ చేయు పాపము. 1 యోహాను 1 : 9 లో "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతి మంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్ణీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" అని వ్రాయబడిన ప్రకారము, మన పాపములకు పశ్చాత్తాపము నొంది క్షమించబడాలి. ఎందుకనగా, యేసు మనిషి పాపాలను క్షమించు శక్తిగలవాడు, క్షమించుటకు మనసుకలవాడు. పాపిని క్షమించగల పరిశుద్ధుడు.

మత్తయి 3 : 13-16 - యొర్దాను నదిలో యోహాను ద్వారా యేసయ్య బాప్తీస్మము పొందాడు.

మార్కు 16 : 16 - నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును అంటూ బాప్తీస్మము రక్షణకు స్థిరమైన పునాదిగా యేసు చెప్పాడు.

యోహాను 3 : 22 - యేసు తన శిష్యులతోకూడ యూదయ దేశమునకు వచ్చి అక్కడ వారితో కాలముగడుపుచు బాప్తీస్మము ఇచ్చుచూఉండెను.

అపో॥ కా॥ 2 : 38 లో పేతురు - మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి అని చెప్పెను.

మత్తయి 28 : 13-20 లో యేసు - వారియొద్దకు వచ్చి పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మయొక్క నామములో వారికి బాప్తీస్మమిచ్చుచూ, నేను మీకు ఏఏసంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటినీ

గైకొనవలెనని వారికి బోధించుడని ఆజ్ఞాపించెను.
అపో॥ కా॥ 17 : 30 - ఆ అజ్ఞానకాలమును దేవుడు చూచిచూడనట్లుగా ఉండెను. ఇప్పుడైతే అంతటను అందరును మారుమనసు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు.
రోమా 10 : 19 - యేసు ప్రభువని నీనోటితో ఒప్పుకొని దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీహృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు.
రోమా 10 : 13 - ప్రభువు నామమునుబట్టి ప్రార్ధన చేయువాడెవడో వాడు రక్షింపబడును.
రోమా 6 : 11 - అటువలె మీరును పాపము విషయమై మృతులుగానూ, దేవుని విషయమై క్రీస్తుయేసు నందు సజీవులుగానూ మిమ్మును మీరే ఎంచుకొనుడి. అనగా పాపము విషయములో చచ్చి నీతిలో జీవించుటే బాప్తీస్మము యొక్క నిర్వచనమని పౌలు తేల్చిచెప్పాడు.
కొలస్సీ 2 : 12 లో మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతోకూడ లేచితిరి.
- బాప్తీస్మము అనగా పాతిపెట్టుట, కప్పిపుచ్చుట, రంగు మార్చుట అని అర్ధము. సాక్షాత్తు యేసే ఈ క్రియ జరిగించి చూపించాడు. బాప్తీస్మము రక్షణకు ఆధారకార్యమైనా, విశ్వాసులు ఐకమత్యముతో ఒకరికొకరు కలిసిమెలిసి జీవించటమనేది ముఖ్యమైన బాధ్యతగా పౌలు స్పష్టముచేస్తున్నాడు.

**ప్రధానాంశము :-** బాప్తీస్మము వద్దనికాదు. సువార్త ప్రకటించాలి. ప్రకటించాలనుకునేవారి సత్ప్రవర్తన, సంభాషణ సరళి చాలా ముఖ్యము అంటున్నాడు పౌలు. సంఘములోనూ, కుటుంబములోనూ తమకిష్టమైనవారినే ప్రేమిస్తూ వారికొరకే ప్రార్థిస్తే మిగతావారు ఏమనుకుంటారు? కొందరి కుటుంబప్రార్ధనలకే హాజరైతే మిగిలినవారిలో అభిప్రాయభేదాలు పుట్టించినవారమౌతాము. రాలేనిస్థితి దేవునికి తెలుసు, రాగలిగినా రానివారిని దేవుడు అడగడా? కనుక సువార్త ప్రకటనలో, సంఘాభివృద్ధిలో ఐక్యతకు అభ్యంతరాలు కలిగించే లోపాలను మనందరము సరిచేసుకోవాలి. కులము, ధనము, తన, మన, పర బేధాలతో ఎవరిని దూరముచేయరాదు. కులగోత్ర అభిమానపుమాటలు, సంఘములో అనవసరము. ఏదోఒక కారణముతో ఇతరులను కించపర్చేవారిని ఎదుటివారు అదేసమయములో మనసునందు అసహ్యించుకుంటారని మీకుతెలుసా? అందుకే పౌలు నాసువార్తలో మానవ జ్ఞానాన్ని నేను ఉపయోగించలేదు అన్నాడు. నిజమైన దైవజ్ఞానానికి అది విరుద్ధమని, క్రీస్తు సిలువలోని విలువైన ప్రభావము పోతుందని, లోకజ్ఞానము పాపవిముక్తినిచ్చి, పరిశుద్ధతలోలో నిలువబెట్టలేదని పౌలు భావము.

సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనము గానీ, రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి. ఇందువిషయమై జ్ఞానుల జ్ఞానమును నాశనముచేతును, వివేకుల వివేకమును శూన్యపరతునని వ్రాయబడియున్నది(1 కొరింథి 1 : 18,19). రెండుగుంపులను గూర్చి పౌలు చెప్తున్నాడు.

**1) నశించువారు :** యోహాను 1 : 29 - లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లగా, ప్రకటన 5 : 10 లో వధింపబడినవాడై, రక్తమిచ్చి సకలజాతులనుండి, దేవునికొరకు

మనుష్యులను కొన్న యేసును రక్షకునిగా అంగీకరించని వారంతా నశించువారు. ఇట్టివారికి ఎంతమంది సువార్తప్రకటించి సాక్ష్యమిచ్చినా, క్రీస్తు సిలువమరణము వెర్రిగానే ఉంది. ఎందుకంటే ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3 : 16). నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని చెప్పెను (లూకా 19 : 10). ధర్మశాస్త్రాన్ని పాటించే యూదులకు, వేదాంతముపట్ల ఆశక్తికల్గి విగ్రహారాధనచేసే గ్రీకులకు సిలువ తెలివితక్కువగా కన్పించింది. ఎందుకనగా వారు దాని విలువను గ్రహించలేదు.

**2) రక్షింపబడువారు :-** రక్షణ మొదట పాపంనుండి, అశాంతి ఆపదలనుండి, వ్యాధి, లేమి, దరిద్రతనుండి కలగాలి. ఆప్రకారమే మరణము యొక్క బలముగలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపచేయుటకును, జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను (హెబ్రి 2 : 15). కావున ప్రజల పాపములకు పరిహారము కలుగుటకై, దేవునిసంబంధమైన కార్యములలో కనికరమును నమ్మకమునుగల ప్రధానయాజకుడగు నిమిత్తము, అన్నివిషయములలో ఆయన తన సహోదరుల వంటివాడు కావలసివచ్చెను. తాను శోధింపబడి శ్రమపొందెను గనుక శోధింప బడువారికిని సహాయము చేయగలవాడై యున్నాడు (హెబ్రీ 2 : 17,18). అబద్ధం, మోసం, దొంగతనం, క్షణికమైన పైచాచిక సుఖము, జీవములేని బొమ్మలకు వంగినమస్కరించడం తెలివితక్కువ అని గ్రహించినవారంతా సిలువ త్యాగాన్ని అంగీకరిస్తారు. అట్టివారిని అహంభావానికి బదులు ఆత్మనిబ్బరముతో సిలువశక్తి నడిపిస్తుంది. **- మరనాత.** **( సశేషం )**

## ( 14 వ పేజీ తరువాయి... ‘ మార్గదర్శి ’ )

దేవునివైపు చూచేలా చేసాడు ప్రభువైన యేసు. తన జీవితాన్ని ఏ పరుపైతే మోసిందో, ఈనాడు యేసు దయ వలన అదే పరుపును తాను సునాయాసంగా మోసాడు. సమస్యలకు లొంగిపోకుండా సమస్యలను లొంగతీసుకొనే సామర్థ్యం ప్రభువు మనకు అనుగ్రహిస్తాడు. స్వస్థత పొందిన తరువాత ఈ వ్యక్తి నేరుగా దేవాలయములోనికి వెళ్ళాడు. 38 సంవత్సరాలపాటు దేవాలయ ద్వారము దగ్గరే ఉన్నాడు కాని ఇప్పుడు యేసు వలన దేవాలయములోనికి వెళ్ళగల్గాడు. ఇక ఆ సమయాన ఎంత గొప్పగా దేవున్ని ఆరాధించాడో! అంతేకాక ఆ వ్యక్తి స్వస్థత పడినట్లు యూదులు, పండుగ చేసుకొనే ప్రజలందరూ గుర్తించారు (5 : 13). దేవున్ని ప్రజలు గుర్తించే సాధనంగా ఈ వ్యక్తి మారాడు.

ప్రియ పాఠకులారా, ఎన్నోమార్లు దేవాలయానికి వెళ్తున్నాం, వస్తున్నాం కాని దేవాలయము దగ్గర పడియున్నవారిని లోనికి తీసుకొని వచ్చామా? నిజముగా దేవున్ని కలిగినవారమైతే తప్పకుండా వేరొక వ్యక్తిని లోనికి తీసుకొని వస్తాము. సమస్యలలో ఉన్నవారి తలను పైకెత్తి సృష్టికర్తను చూపించే కృప ప్రభువు మనకు అనుగ్రహించును గాక!

**- మరనాత.**

# ఫిలేమోను పత్రిక

శ్రీమతి దేవినేని నిర్మల, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ

ప్రియ మరనాత మెసేంజర్ పాఠకులకు శుభములు. ఇప్పటివరకు మనము ఒక క్రమములో అపోస్తలుడైన పౌలు వ్రాసిన చెర పత్రికలలో ఎఫెసి, ఫిలిప్పీ మరియు కొలస్సి పత్రికలలో దాగియున్న సత్యములను గ్రహించితిమి. చెర పత్రికలలో చివరి పత్రికయైన ఫిలేమోను పత్రికను గురించి కూడా తెలుసుకుందాము. అపోస్తలుడైన పౌలు వ్రాసిన పత్రికలలో చిన్న పత్రిక ఫిలేమోను పత్రిక. పౌలు ఫిలేమోనును తన యజమానుడైన ఒనేసీము యొద్ద నుండి పారిపోయిన ఒక బానిసగా కాక, క్రీస్తునందున్న సోదరునిగా అంగీకరించెను(16, 17 వచనాలు). ఈ వ్యక్తిగత పత్రిక మారుమనస్సు పొందిన ఒక బానిసపట్ల కనపరచే శ్రద్ధ మాత్రమే కాదుగాని ఆచరణాత్మకముగా క్రీస్తునందు ఒక సోదరునిగా గుర్తించి గలతీ 3 : 20 లో పేర్కొన్నట్లుగా "స్వతంత్రుడని లేదు, బానిసనిలేదు", అందరూ క్రీస్తునందు ఏకమైయున్నారని తెలియజేసెను. ఈ పత్రికలో ప్రాముఖ్యమైనది క్రైస్తవుని యొక్క ప్రేమ మరియు క్షమాపణ. అతి చిన్న పత్రికగా ఉన్న దీనిని కొన్ని ప్రాముఖ్యమైన విభాగాలుగా విభజించి తెలుసుకుందాము.

పౌలు రోమా చెరలో ఉన్నాడు. అతని స్నేహితుడైన ఫిలేమోను కొలస్సి పట్టణములో ఉన్నాడు. పారిపోయిన బానిసయైన ఒనేసీము వలన వీరిప్పుడు తమ సంబంధాలను గుర్తుచేసుకుంటున్నారు. ఇక్కడ పేర్కొనబడిన సంగతులు అంత స్పష్టంగా లేవు. అయితే ఒకటి మాత్రం సత్యం. అది ఏమంటే ఒనేసీము తన యజమానియైన ఫిలేమోను దగ్గర దొంగతనము చేసి రోమాకు పారిపోయి, గుంపులో కలిసిపోయి ఉందామని అనుకొన్నాడు. దేవుని కృప వలన ఒనేసీము చెరలో ఉన్న పౌలుగారిని కలుసుకొని రక్షింపబడ్డాడు. ఆ తరువాత ఏమి జరిగింది? ఒనేసీము చెరలోనున్న పౌలు దగ్గర ఉన్నట్లయితే అతనికి ఎంతో సహాయంగా ఉండియుండేవాడు. కానీ అతని యజమాని పరిస్థితి ఏమిటి? ఒక బానిస ఎల్లప్పుడూ తన యజమానినే సేవించాలి. చట్టప్రకారం బానిసగా ఉన్న ఒనేసీము చేసిన పనికి అతనికి శిక్షవిధింపబడాలి. కానీ ఫిలేమోను ఒక క్రైస్తవుడు. కానీ అతడు ఒనేసీముని శిక్షించకుంటే ఆనాటి కాలములో బానిసల పరిస్థితి ఏమిటి? శిక్షిస్తే క్రైస్తవుడిగా అతని సాక్ష్యము ఏమిటి? ఇది ఒకింత ఆలోచించవలసినదే. మీరే ఫిలేమోనైతే ఒక క్రైస్తవుడిగా ఏమి చేస్తారు? ఆలోచించండి.

కొలస్సి పత్రికతోపాటు ఈ పత్రిక కూడా తుకికునకు ఒనేసీముతో కూడా ఇచ్చి పంపబడెను (కొలస్సి 4 : 7-9). దీనిలో పౌలు గారు పోషించిన మూడు ప్రాముఖ్యమైన పాత్రలు ఫిలేమోనును తన సమస్యనుండి విడుదల కలిగించినవి. మార్టిన్ లూథర్ - "మనమందరము ఒనేసీమువంటి వారమేనని" చెప్పెను. అది చాలా వాస్తవము. అందరూ ఈ మాటతో ఏకీభవించవలసినదే.

కొలస్సిలో ఉన్న సంఘమును పౌలు స్థాపించలేదు మరియు దానిని ఎన్నడూ దర్శించనూలేదు (కొలస్సి 1 : 1-8; 2 : 1). ఎఫెసులో పౌలు చేసిన పరిచర్య ఫలితమే ఈ సంఘము (అపో॥ కా॥ 19 : 10, 20, 26). ఎపఫ్రా ద్వారా ఈ సంఘము ఏర్పడెను (ఫిలేమోను 23). తనకు అప్పగింపబడిన పరిచర్య విషయములో జాగ్రత్తగా ఉండమని కొలస్సి సంఘవిశ్వాసులతో పౌలు మాట్లాడెను. దీని వెలుగులో తండ్రియైన దేవుడు తన కుమారుడైన క్రీస్తు ద్వారా మన జీవితములో ఏమి చేసెనో దీని వెలుగులో మనము తెలుసుకుందాము.

**1. ఒక వ్యక్తిపక్షముగా ప్రేమతో విజ్ఞాపన చేయుట** (A Man to Whom it was easy to Appeal) **(1-7 వచనాలు) :-** పత్రికలన్నింటిలోకెల్లా అసాధారణమైన పత్రిక. తన పత్రికలలో ఎవరినీ ఎన్నడూ అభ్యర్ధించని అపోస్తలుడైన పౌలు ఈ పత్రికలో ఒక అభ్యర్ధన చేయుచున్నాడు. తనకొరకు కాక ఈ అభ్యర్ధన మరొక వ్యక్తి పక్షముగా అనగా తన జీవితంలో చేయకూడని పని చేసి పారిపోయిన వ్యక్తి పక్షముగా పౌలు అభ్యర్ధించుట విశేషము.

సహజంగా పౌలు తాను వ్రాసే పత్రికలలో ఒక అపోస్తలునిగా తనను తాను పరిచయం చేసుకొనుట ఆనవాయితీ. కానీ తన ఆనవాయితీని విడిచిపెట్టి ఒక స్నేహితుడు మరొక స్నేహితునికి వ్రాస్తున్నట్లుగా వ్రాయుట ప్రత్యేకమైనది. క్రీస్తు ఖైదీగా చెప్పుకున్నాడే కానీ, క్రీస్తు అపోస్తలుడుగా చెప్పుకొనలేదు. అధికారయుతముగాకాక తన అభ్యర్ధనను జాలితోను, ప్రేమతోను కనపరచెను.

రెండవ వచనములో చెప్పబడినట్లుగా సంఘము ఫిలేమోను మరియు అతని భార్యయైన అఫియ ఇంట సమావేశమయ్యేవారు. అర్ఖిప్పు అతని కుమారుడని చెప్పేవారు. కానీ ఇది ఎంతవరకు సత్యమో అనునది తెలియదు. మరియు కొంతమంది ఇతను సంఘంలో పెద్దయైయుండవచ్చు అని, ఎపఫ్రా స్థానములో అక్కడ పరిచర్య చేస్తూ ఉండవచ్చని అభిప్రాయపడుతూ ఉండేవారు. ఒకవేళ ఇదే సత్యమైతే కొలస్సి 4 : 17 లో పౌలుగారు అర్ఖిప్పును ఉద్దేశించి మాట్లాడినది సరియైనదేనని అనేకుల అభిప్రాయము. ఫిలేమోనుతో పాటు వీరిరువురూ కూడా పారిపోయిన బానిస యొక్క రాక కొరకు ఎంతో ఆశతో ఎదురుచూసియుండవచ్చు. పౌలు యొక్క క్రైస్తవ సేవను బహుశ అర్ఖిప్పు చాలా దగ్గరగా ఉండి చూసియుండవచ్చు. అందువలననే అర్ఖిప్పును తోడియోధుడని సంబోధిస్తున్నాడు.

ఫిలేమోను క్రీస్తుపట్ల కలిగియున్న విశ్వాసము, ప్రేమ అనునది కొలస్సి పట్టణములో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు. రోమా చెరలోనున్న పౌలు దగ్గరకు సహితం ఈ వార్త చేరుకున్నది. పౌలు రోమా చెరలోనుండుట అనునది అక్కడి ప్రజలకు ఎడారిలో ఒయాసిస్సులాంటిది. పౌలు చెరలోనున్ననూ తన దగ్గరకు వచ్చే దేవుని ప్రజల హృదయాలను దేవుని మాటలతో ఎంతో ఉత్తేజపరచుచుండెను. కొలస్సి పట్టణములోనున్న

ఫిలేమోను గృహములో సహజముగా క్రీస్తును ఆరాధించుటకు సమావేశమయ్యేవారు. అక్కడి ప్రజలకు ఆ గృహము ఎంతో దీవెనను, ఆశీర్వాదమును అందిస్తూ ఉండేది.

ఈ ఆరవ వచనము ఎంతో కీలకమైనది - ‘‘క్రీస్తును బట్టి మీయందున్న ప్రతి శ్రేష్టమైన వరము విషయమై నీవు అనుభవపూర్వకముగా ఎరుగుట వలన ఇతరులు నీ విశ్వాసమందు పాలివారగుట అనునది కార్యకారికావలయునని వేడుకొనుచున్నాను’’ అను వాక్యమును ఒకింత శ్రద్ధగా తెలుసుకోవాలి. ‘నీ విశ్వాసమందు పాలివారగుట’ అను పదమునకు గ్రీకులో కోయినోనియా, పిస్టిన్ అను రెండు పదములు వాడబడినవి.

**ఎ) కోయినోనియా :** అనగా వ్యాపారములో భాగస్వామ్యమును పంచుకొనుట. ఈ పదమునకు మూడు విధములైన ఆలోచనలు కలవు.

**1. భాగస్వామ్యము :** క్రైస్తవ విశ్వాసములో, ప్రార్ధనలో ఫిలేమోను మరియు పౌలులిరువురూ భాగస్వామ్యమును పంచుకొన్న కొలదీ అది ఫిలేమోనును క్రైస్తవ సత్యము యొక్క లోతుల లోనికి నడిపించినది.

**2. సహవాసము :** ప్రార్ధనలో సహవాసము అనగా క్రైస్తవ సహవాసము ఫిలేమోనును మరింత సత్యములోనికి నడిపించినది.

**3. ఆచరణాత్మకముగా పంచుకొనుట :** అనగా క్రీస్తుకు సమీపముగా జీవించుటకు జ్ఞానముతోను, దాతృత్వములోను మరియు మంచి సంగతులలోను ప్రార్ధనలో నడిపించబడుట.

ఈ సందర్భములో మూడవదిగా చెప్పబడిన **‘ఆచరణాత్మకముగా పంచుకొనుట’** అను భావము సరియైనదిగా కనబడును. క్రైస్తవ దాతృత్వము అనునది ఫిలేమోను కలిగియున్న లక్షణము. దేవుని ప్రజల పట్ల ఫిలేమోను ఎంతో ప్రేమను కలిగియుండి తన గృహమును కూడా దేవుని ప్రజలు ఆరాధించుటకును, విశ్రాంతి పొందుటకును మరియు ప్రోత్సహించ బడుటకును ఇచ్చివేసెను. ఇటువంటి దాతృత్వము కలిగిన ఫిలేమోనును మరింత దాతృత్వము కలిగియుండమని కోరెను. దీనినుండి మనము నేర్చుకొనే అమూల్యమైన పాఠములు ఏమనగా :

- ఇతరులకు అందించే క్రీస్తు ప్రేమ
- ఇతరుల కొరకు తన్ను తాను రిక్తునిగా చేసుకొన్న క్రీస్తు ప్రేమ
- క్రీస్తు యొక్క ఐశ్వర్యమును కలిగియుండుటకు తెరవబడిన హృదయము మరియు దాతృత్వముతో కూడిన హృదయమును సరియైన మార్గముగా ఎంచుట
- లేఖనాలపట్ల జ్ఞానము కలిగిన ఒక పండితుడు లేదా అనేక గంటలు ప్రార్ధనలో గడిపే పరిశుద్ధుడు కంటే ప్రేమతో, దాతృత్వముతో ఇతరులకొరకు కదిలే వ్యక్తే క్రీస్తు అనుచరుడు.

ఫిలేమోను తన జీవితములో ఇటువంటి లక్షణాలు కలిగిన తన వ్యక్తిత్వమును బట్టి అనేకుల మధ్య పెదవులతో కాక ప్రవర్తన ద్వారా క్రీస్తును కనబరచెను. **- మరనాత.**

**( సశేషం )**

# జ్ఞానధార

డా॥ కొటారి మనష్షే, గుంటూరు

1. చేసే ప్రతి పాపం అప్పు లాంటిదే ఏదో రోజు వడ్డీతో సహా తీర్చాల్సిందే. చేసే ప్రతి పుణ్యం పొదుపు ఖాతాలో వేసినట్టే ఆపద సమయంలో ఆదుకుంటుంది.
2. కాలి కింద ఉంది కదా అని ధూళిని చులకనగా చూడకు కంటిలో పడినప్పుడే తెలుస్తుంది దాని సత్తా ఏమిటో.
3. మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసపోతూవుంటారు.
4. బాధ "పంచుకొనేలా" ఉండాలి కానీ బాధ "పెంచేలా" ఉండకూడదు.
5. మనిషికి నిలబడటం తేలిక పరుగెత్తడం కష్టం కానీ మనసుకు పరుగెత్తడం తేలిక నిలబడటం కష్టం.
6. క్షమించలేని వారిని మరిచిపోవాలి. మరిచిపోలేని వారిని క్షమించేయాలి.
7. గొప్ప రోజులంటూ ప్రత్యేకంగా ఉండవు రోజుని మనమే గొప్పగా మార్చుకోవాలి.
8. విజయం అంటే గమ్యం మాత్రమే కాదు కొత్త లక్ష్యాలకు పునాది.
9. నిన్ను చూసి ఈ ప్రపంచం మారాలి కానీ ఈ ప్రపంచాన్ని చూసి నువ్వు మారకు.
10. ఆశయం లేని జీవితం దీపం లేని ఇంటి వంటిది.
11. అజ్ఞానం ఎప్పుడూ మార్పుకు భయపడుతూ వుంటుంది.
12. అందరిలో మంచి చూడటం నేర్చుకుంటే మనలో మంచి మరింత పెరుగుతుంది.

13 అంతరంగం అందంగా వుంటే ఆచరణ అర్ధవంతంగా వుంటుంది.

14 అసమర్థుని ఆఖరి అస్త్రమే హింస.

15 ఆశావాది గులాబీని చూస్తే నిరాశావాది దాని కింది ముల్లును చూస్తాడు.

# వార్తల్లో కొన్ని...

## పీచు పదార్థాలతో బీపీ, మధుమేహానికి చెక్

**న్యూఢిల్లీ, అక్టోబరు 4 :** పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారం తినేవారిలో గుండె సంబంధిత వ్యాధులువచ్చే అవకాశం తక్కువని శాస్త్రవేత్తలు తెలిపారు. పీచు పదార్థాల వల్ల బీపీ అదుపులో ఉంటుందని, శరీరంలోని చక్కెరల్లో స్థిరత్వం వస్తుందని వెలడించారు. మధుమేహం నియంత్రణలో ఉంటుందని చెప్పారు. 200 మందిపై 6 నెలలపాటు పరిశోధనలు చేసి ఈ వివరాలను వెల్లడించారు.

## కంటి కేన్సర్‌ను గుర్తించే యాప్

**హ్యూస్టన్, అక్టోబరు 4 :** కంటి కేన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించేందుకు శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా స్మార్ట్‌ఫోన్ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ పేరు క్రాడల్ (కంప్యూటర్ అసిస్టెడ్ డిటెక్టర్ ల్యూకోకోరియా). ఇది ఫొటోలను స్కాన్ చేసి కంటికి సంబంధించిన వ్యాధులను తెలియజేస్తుంది. ముఖ్యంగా రెటీనాపై తెల్లని పొర ఏర్పడటాన్ని ఇది ముందుగానే పసిగడుతుంది. కంటి కేన్సర్ 'రెటీనోబ్లాస్టోమా'కు సంబంధించి మొదటిదశలో రెటీనాపై తెల్లని పొర ఏర్పడుతుంది. ఈ యప్‌తో దానిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

## వ్యాధినిరోధక శక్తి పెంచే 'పసుపు మాత్ర'

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 :** ఏదైనా గాయమైనప్పుడు, కాలినప్పుడు వెంటనే వాడదగిన సహజ ఔషధం పసుపు అని మనందరికీ తెలుసు. అందులో ఉండే 'కుర్క్యూమిన్' అనే పదార్థంలోని యాంటీ ఆక్సిడెంట్లవల్లే పసుపు ఒక ఔషధిగా పనిచేస్తుంటుంది. హృద్రోగాలు, మధుమేహానికీ బలమైన నిరోధకంగా పనిచేయగలగడం దీని ప్రత్యేకత. ఇటువంటి ఎన్నో ఆయుర్వేద గుణాలున్న పసుపును 'స్నెక్ 30' మాత్రల రూపంలో అందుబాటులోకి తెచ్చినట్లు స్నెక్ 30 వ్యవస్థాపకుడు డాక్టర్ సౌరభ్ అరోరా ప్రకటించారు. ఆహారం ద్వారా మన శరీరానికి అవసరమైన దానిలో 5 శాతమే కుర్క్యూమిన్ అందుతుందని.. మిగిలిన లోటును ఈ పసుపు మాత్ర భర్తీ చేస్తుందన్నారు. ఎక్కువ మోతాదులో తీసుకున్నా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవన్నారు.

## బరువు తగ్గితే మధుమేహానికి కళ్లెం

**లండన్, సెప్టెంబరు 30 :** మధుమేహాన్ని(షుగర్) గుర్తించిన తొలి ఐదేళ్లలో 10% శరీర బరువును తగ్గించుకోగలిగితే, దాని బారినుంచి తప్పించుకోవడం సాధ్యమేనని బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి వర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అధ్యయనంలో భాగంగా అప్పుడే మధుమేహం బారినపడిన 867 మంది 40-69 ఏళ్లవారి ఆరోగ్య వివరాలను ఐదేళ్లపాటు సేకరించి, పరిశీలించారు. వారిలో 257 మంది(30%) రోజూ 700 కేలరీలకు మించకుండా ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బరువును 10% మేర తగ్గించుకున్నట్లు గుర్తించారు. ఫలితంగా వారిలో మధుమేహం అదుపులోకి వచ్చినట్లు తేలింది. కాగా, గోధుమరంగు కొవ్వు కణజాలం నుంచి వెలువడే 12-హెచ్‌ఈపీఈ అణువులకు రక్తంలోని చక్కెర (షుగర్) స్థాయిని తగ్గించే శక్తి ఉందని బ్రెజిల్, అమెరికా శాస్త్రవేత్తల బృందం అధ్యయనంలో వెల్లడైంది.

## వీర్యం నాణ్యతను పెంచే టమాటా

**లండన్, అక్టోబరు 10 :** టమాటాలు తింటే పురుషుల్లో వీర్య కణాల నాణ్యత పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. టమాటాల్లో సమృద్ధిగా ఉండే 'లాక్టోలైకోపీన్' వీర్యం నాణ్యత పెరగడంలో తోడ్పడుతుందని ఇంగ్లండ్‌లోని షెఫీల్డ్ వర్సిటీ పరిశోధకులు గుర్తించారు. లాక్టోలైకోపీన్ వీర్యకణాల చలనశీలతను 40% పెంచిందని వివరించారు. టమాటాలను

ఎక్కువగా తినడం ద్వారా పురుషుల్లో సంతానో త్పత్తి సమస్యలు తగ్గుతాయని చెప్పారు. 19-30 సంవత్సరాల వయసున్న కొంత మందిపై పరిశోధనలు చేసి ఈ విషయాన్ని వెల్లడించారు. శాంపిల్ పరిమాణం చిన్నదై నప్పటికీ తమ పరిశోధనల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు.

## గర్భిణులు ఒత్తిడికి గురైతే.. శిశువు మెదడుకు ముప్పు

**లండన్, అక్టోబరు 10 :** గర్భిణులు కుటుంబ, ఉద్యోగ పరమైన సమస్యలతో ఒత్తిళ్లకు గురైతే ఆ ప్రభావం వారికి పుట్టబోయే శిశువుల మెదడుపై పడుతుందని లండన్‌లోని కింగ్స్ కళాశాల శాస్త్రవేత్తలు అంటున్నారు. గర్భావధి కాలానికి (9 నెలలు) ముందే పుట్టిన 251 మంది చిన్నారుల్లో మెదడు వికాసం.. అంతకు ముందు వారి తల్లులు ఎదుర్కొన్న మానసిక ఒత్తిళ్ల వివరాలపై తులనాత్మక అధ్యయనం అనంతరం ఈ నిర్ధారణకు వచ్చారు. ఇందులో భాగంగా గర్భిణులుగా ఉన్నప్పుడు వారికి ఎదురైన చేదు అనుభవాలు, బాధలు, వేధింపులు, ఒత్తిళ్ల వివరాలు తెలుసుకునేలా ఓ ప్రశ్నావళిని రూపొందించి, జవాబులు రాబట్టారు. సమస్యలతో మానసిక వ్యధను అనుభవించిన చాలామంది గర్భిణులకు ముందస్తు కాన్పులు జరిగినట్లు గుర్తించారు.

## శీతల పానీయాలతో కాలేయానికి కొవ్వు ముప్పు

**వాషింగ్టన్, అక్టోబరు 2 :** ఫ్రక్టోస్ అధికంగా ఉండే ప్యాకేజ్డ్ ఫుడ్, శీతల పానీయాలు తీసుకోవడం వల్ల కాలేయం పనితీరుపై ప్రభావం పడుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అధిక ఫ్రక్టోస్ వల్ల కాలేయంలో కొవ్వును కరిగించే మైటోకాండ్రియాలు పాడవుతాయని, ఫలితంగా కొవ్వు పేరుకుపోతుందని చెప్పారు. ఇది శరీర జీవక్రియపై ప్రభావం చూపుతుందన్నారు. కాగా, కొవ్వును కరిగించడంలో గ్లూకోజ్ పాత్ర మెరుగైనదని చెప్పారు. గ్లూకోజ్, ఫ్రక్టోస్‌లు సమాన స్థాయిలో కేలరీలు కలిగి ఉన్నప్పటికీ ఫ్రక్టోస్ ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యానికి ముప్పని చెప్పారు.

## తప్పును పట్టే బ్రెయిన్ సెన్స్!

**లండన్, అక్టోబరు 2 :** చదివే సమయంలో తప్పు పదాలను మెదడు ఏవిధంగా గుర్తిస్తుందో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనికోసం లామినార్ ఫంక్షనల్ మాగ్నెటిక్ ఇమేజింగ్ రెసోనెన్స్ (ఐఎఫ్ఎమ్ఆర్ఐ) అనే పరికరాన్ని ఉపయోగించారు. ఒక పదం చదివినప్పుడు మెదడులో రెండు రకాల చర్యలు జరుగుతాయి. ఒకటి 'బాటమ్ అప్' చర్య. ఈ చర్యలో మెదడు పుస్తకంలోని పదాలను గుర్తిస్తుంది. రెండవది 'టాప్ డౌన్' చర్య. ఇది మనిషి జ్ఞాపకశక్తికి సంబంధించినది. మెదడులో అప్పటికే నిక్షిప్తమై ఉన్న పదం, మనం చదువుతున్న పదం ఒకటేనా కాదా అన్న విషయాన్ని నిర్ధారిస్తుంది. ఈ పరిశోధనలో ఒకే రకమైన వేర్వేరు పదాలను ఇచ్చి మెదడు చర్యలను అధ్యయనం చేశారు. చదివేటప్పుడు మెదడులో ఏ భాగం క్రియాశీలకకంగా ఉంటుందో కనుగొన్నారు. మెదడు లోపలి పొరలు 'టాప్ డౌన్' చర్య సమయంలో క్రియాశీలకంగా ఉండగా, మధ్య పొరలు 'బాటమ్ అప్' చర్య సమయంలో క్రియాశీలకంగా ఉన్నాయి.

## మధుమేహానికి దివ్యౌషధం బెండకాయ

**న్యూఢిల్లీ, అక్టోబరు 3 :** డయాబెటిస్ నియంత్రణకు బెండ అద్భుతంగా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు చెప్పారు. దీనిలో ఉండే పీచు పదార్థం శరీరంలోని కొవ్వును కరిగిస్తుందని తెలిపారు. బెండ రక్తంలోని చక్కెరలను తగ్గించి, వాటి స్థాయిలో స్థిరత్వం తీసుకొస్తుందని చెప్పారు. టైప్ 2 మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో కాలేయం వద్ద కొవ్వు కరిగి జీవక్రియ మెరుగుపడుతుందని చెప్పారు. బెండను కోసి ఆముక్కలను రాత్రంతా నానబెట్టి ఉదయం ఆ జ్యూస్‌ను తాగితే మెరుగైన ఫలితాలు కనిపించినట్లు వారు తెలిపారు.




-: ప్రతుల కొరకు : -

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Gollapudi, VIJAYAWADA - 521 225
Printed on 08-10-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

## ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

Calvary TV

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు

శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు

శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు

శుక్రవారం రాత్రి 9 :30 - 10 గంటల వరకు

శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

# మరనాత వేద పాఠశాల - విశాఖ

## మరనాత విశ్వాస సమాజపు పరిచర్య

"దైవసేవ - దేశసేవా తత్పరులైన యువతకు అద్భుత అవకాశం"



జన్మ, కర్మ, పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగువారికి చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! లేవాలి!! అందుచేతనే స్వయాన ప్రభువు వారే "కోత విస్తారమేగాని పని వారు కొద్దిగా ఉన్నారు" అని వాపోయారు.

దైవజనులు
శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 33 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ. గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.



**నిర్వహించే కోర్సులు :**

1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సం॥లు (4 సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సం॥లు (6 సెమిస్టర్లు)
3) 40 రోజుల వేసవి వేదపాఠశాల (ఏప్రిల్ 9- మే నెల 19 వరకు )

అర్హతలు : రక్షణానుభవము, సేవార్హమైన దేవుని పిలుపు, సమర్పణ, 18 సం॥లు పైన వయస్సు గలవారు.

**స్త్రీలకు ప్రత్యేక వసతి**

వాక్యతర్ఫీదు పొందదలచిన ఆసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ. 100/-లు పంపి, పొంది, పూర్తి చేసి వెంటనే పంపించవలెను. భోజనము, వసతి : ఉచితం; బోధనా భాష : తెలుగు.




**ప్రత్యేకతలు :**

- ఉన్నత విద్యార్హతలు
- వాక్య పరిజ్ఞానము
- స్వదేశి, విదేశీ సేవానుభవం కలిగిన అధ్యాపక బృందం మరియు
- వ్యక్తిగత శ్రద్ధ
- క్రమశిక్షణ
- సిద్ధాంత, ఆచరణాత్మక సబ్జెక్టుల సమన్వయము.

వివరములకు :
రెవ. శిలివ్వరపు సైలస్ ప్రకాష్
M.Com., M.Div. (USA)
డైరెక్టర్, మరనాత వేద పాఠశాల
50-43-9, పి అండ్ టి కోలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం-530013.
✆ : 98481 24651,
9949590555, 8897884111
maranathavisakha@gmail.com






R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-06-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month


మరనాత
బిబ్లికల్ సెమినరీ
విజయవాడ
Accredited by
Asia Theological Association &
Christ For The Nations Association of Bible Schools
కోర్సులు కాలపరిమితి బోధనాభాష
B.Th 3 సంవత్సరాలు ఇంగ్లీష్ & తెలుగు
Dip.Th 2 సంవత్సరాలు తెలుగు
C.Th ఒక సంవత్సరం తెలుగు
జూన్ 24 నుండి క్లాసులు ప్రారంభం
అభిషిక్తులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.
శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
2019
ఏప్రిల్ 8 - మే 17 వరకు
విశిష్టతలు
Spoken English Courses
ATA Curriculum
మరనాత విశ్వాస సమాజము
గాయత్రినగర్, విజయవాడ.
E-mail : mvpvja8@gmail.com
9642793777
9441308156, 7799212199